23 . 2. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 260 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper




## సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

- ఆరోగ్య, బీమా పథకాలపై హర్షం
- సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

**హైదరాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ

# త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'


- ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి నడిపించాలన్నదే మా అజెండా
- తెలంగాణ సమగ్రాభివృద్ధికే 'క్యూర్ – ప్యూర్ – రేర్'
- 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలనే లక్ష్యంతో.. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు శ్రీకారం చుట్టబోతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత పరుగులు పెట్టించేలా, పెట్టుబడిదారులకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేలా, ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా అందరితో చర్చించి ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్రోత్ ఎక్స్ 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... గ్రోత్ అంటే యాదృచ్ఛికంగా వచ్చేది కాదని, భావి తరాల భవిష్యత్తు కోసం శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ విజన్ 2047' ను రూపొందించిందన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న తెలంగాణను, 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య

## ఎంతకాలం ఉంటానో తెలియదు..

- అయినా వెనకడుగు వేసే ప్రసక్తి లేదు
- నన్ను చంపడానికి అందరూ కాచుక్కూచున్నారు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య



**వాషింగ్టన్,ఫిబ్రవరి24 వెలుతురు:**
నేను ఎంతకాలం ఉంటానో తెలియట్లేదు' అని అమెరికా అధ్యక్షుడు



## 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

- బస్ టికెట్ పొందే సౌకర్యం
- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



## జిహెచ్ఎంసిలోనూ
# పాగా వేస్తాం

- ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకు వెళతాం,
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని అన్నారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే కరీంనగర్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకే



## 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం

- అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- పకడ్బందీగా పరీక్షల నిర్వహణ
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

**హైదరాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర




## మావోయిస్ట్ పార్టీకి
# భారీ దెబ్బ

- డిజిపి ఎదుట లొంగిన ప్రధాన నేతలు
- లొంగిన వారిలో దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, జగన్, గంగన్న
- 40 ఏళ్ల అజ్ఞాతానికి వీడ్కోలు పలికిన మావోలు
- వారిపై ఉన్న రివార్డును అందిస్తామన్న డిజిపి
- కేవలం ఇక 11 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
తెలంగాణలో నలుగురు మావోయిస్టు అగ్రనేతలు మంగళవారం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో అధికారికంగా లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు (పీబీఎం) తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అలియాస్ కుమ్మ దాదా, సెంట్రల్ కమిటీ సభ్యుడు (సీసీఎం) మల్లారాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ రంగారం, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు (ఎస్సీఎం) నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ రన్నా దాదా ఉన్నారు. 40 ఏళ్లకు పైగా అజ్ఞాతంలో పనిచేసిన ఈ అగ్రనేతలు లొంగుబాటు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పూర్తిగా నిర్వీర్యం అయినట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నలుగురి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీలో అగ్రస్థాయి బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన ఇంకా 11 మంది అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. వారు కూడా త్వరలో

## ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

- ప్రజల సమస్యల కోసం ఇకముందూ పోరాడుతాం
- లొంగిన మావోయిస్టులు దేవ్‌జీ, రాజిరెడ్డి వెల్లడి



జనజీవనంలోకి రావాలని డీజీపీ కోరారు. ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి అడవుల్లో లేరని, బయట ఎక్కడో షెల్టర్ తీసుకున్నట్లు గుర్తించామన్నారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీపై రూ.25 లక్షలు, మల్లారాజి రెడ్డిపై రూ.25 లక్షలు, బడే చొక్కారావు, నూనె నరసింహా రెడ్డిలపై రూ.20 లక్షల చొప్పున నగదు రివార్డు మొత్తాన్ని వారికి అందజేస్తామని ప్రకటించారు. 2019లో తెలంగాణలో మావోయిస్టులు రిక్రూట్‌మెంట్ జరిగిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. 1982లో సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో చేరిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ దండకారణ్యంలో ఆయుధ దళ కార్యకలాపాలు నిర్వహించారు. 1984-89 మధ్య సిరోంచా, పెరిమిలి ప్రాంతాల్లో దళ



## నైపుణ్యాభివృద్ధి.. అభివృద్ధి వ్యూహం

- అడ్వాన్స్ స్కిల్ సెంటర్లుగా ప్రభుత్వ ఐటీఐలు
- పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళిక
- కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి

## మీ అరచాకాలను ఇక సహించేది లేదు

- మా నేతలను జైలులో పెడితే భయపడబోం
- నీకూ అదే గతి పట్టక తప్పదు రేవంత్
- బాల్క సుమన్‌ను జైలులో పరామర్శించిన కెటిఆర్



**ఆదిలాబాద్,ఫిబ్రవరి24 వెలుతురు:**
ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు

## భారత్‌ను అమెరికాకు
# అమ్మేశారు

- అమెరికాకు తలొగ్గిన ప్రధాని మోడీ
- మరోమారు విమర్శలు గుప్పించిన రాహుల్




**భోపాల్,ఫిబ్రవరి24 వెలుతురు:**
భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర

# వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

- 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగం
- రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ
- ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగానే కల్తీ జరిగిందని చెప్పా
- అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారు
- కల్తీపై దేవుడే తనతో విషయాలు వెల్లడించేలా చేశారు
- మహాపాపం' పేరిట లడ్డూ కల్తీ పై అసెంబ్లీలో బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**అమరావతి,ఫిబ్రవరి24 వెలుతురు:**
వైకాపా హయాంలో 20 కోట్ల లడ్డూలను కల్తీ నెయ్యితో తయారు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మహాపాపం' పేరిట వైకాపా హయాంలో లడ్డూ కల్తీ జరిగిన తీరును పవర్



పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన వివరించారు. రాజకీయ వివాదం ఉండకూడదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సిట్ ఏర్పాటు చేశారు. సీబీఐ ఆధ్వర్యంలో విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపించింది. అందుకే ఏకసభ్య కమిటీ వేయాలని నిర్ణయించాం. లడ్డూ వ్యవహారంలో కాకుండా అనేక

## కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే

- ఆనాటి బోర్డును జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు
- రసాయనాలతో కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని రుజువయ్యింది
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,ఫిబ్రవరి24 వెలుతురు:**



కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే శిక్ష పడాల్సిందేనని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో

## త్వరలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'

సాధనకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 'క్యూర్ - ప్యూర్ - రేర్' అనే త్రిముఖ వ్యూహానికి శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామ న్నారు. నగరం నుంచి గ్రామం వరకు ప్రతి ప్రాంతాన్ని వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ అజెండా అని స్పష్టం చేశారు. ఏఐ, ఇండస్ట్రీ 5.0 లాంటి టెక్నాలజీస్ తో వర్క్ కల్చర్ లో మార్పు వచ్చిందని, రాబోయే రోజుల్లో కంపెనీల కంటే 'ఎకో సిస్టం'కే ప్రాధాన్యత ఉంటుందన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానినే నిర్మించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే వ్యవస్థలా కాకుండా, వారితో కలిసి నడిచే భాగస్వామిగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా.నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, స్కై రూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'మీ సేవ' మొబైల్ ఆప్ ప్రారంభం

**హైదరాబాద్,ఫిబ్రవరి 24 వెలుతురు:**
టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం మీసేవ మీ టికెట్ మొబైల్' యాప్ ద్వారా సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ , రవాణా శాఖ స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్ , తెలంగాణ ఆర్టీసీ వీసీ / ఎండీ వై.నాగిరెడ్డి, మీసేవ కమిషనర్ రవికిరణ్తో కలిసి మీ మొబైల్ ఆప్ ను ఆవిష్కరించారు. ఈ సరికొత్త విధానం ద్వారా మీ టికెట్ మొబైల్ యాప్ క్షఖఖా సేవలను కూడా అనుసంధానిస్తుంది. ప్రయాణీకులు సుదూర ప్రయాణాలు, ఇంటర్‌సిటీ బస్సు టిక్కెట్లను డిజిటల్‌గా బుక్ చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదు రకాల బస్ పాస్‌లు పొందే సౌకర్యం కలుగనుంది. మీ టికెట్ మొబైల్ యాప్ ద్వారా ఇప్పుడు ఐదు కేటగిరీల సిటీ బస్ పాస్‌లు డిజిటల్‌గా అందుబాటులో ఉన్నాయి. బస్ పాస్ మాడ్యూల్ హైదరాబాద్ నగరంలోని ప్రయాణీకులకు మొబైల్ యాప్ ద్వారా నెలవారీ బస్ పాస్‌లను డిజిటల్‌గా తీసుకోవడానికి మరియు పునరుద్ధరించడానికి వీలు కల్పిస్తుంది.అందుబాటులో గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో కార్యకలాపాల కోసం టి 24 టికెట్‌ను మొబైల్ యాప్‌లో విలీనం చెయ్యడం జరిగింది. టి 24 టికెట్ అనేది 24 గంటల డిజిటల్ ట్రావెల్ పాస్, ఇది యాక్టివేషన్ సమయం నుండి సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ మరియు మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులలో అపరిమిత ప్రయాణాన్ని అనుమతిస్తుంది.టి-24 టికెట్ పర్యాటకులకు, అప్పుడప్పుడు ప్రయాణించేవారికి మరియు ఒకే రోజులో బహుళ ట్రిప్పులు అవసరమయ్యే ప్రయాణీకులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో టిజీఎస్ ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్ , వెంకన్న, ఖుస్రో షా ఖాన్ ,రాజశేఖర్ , ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప , సిటీఎం శ్రీదేవి సిఈ(ఐటి) శ్ శ్రీదేవి,హైదరాబాద్ , రంగారెడ్డి ఆర్ఎం లు సుధాపరిమళ , శ్రీలత పలువురు అధికారులు పాల్గొన్నారు

## సిఎం రేవంత్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇనర్ణయం తమకెంతో భరోసా నింపిందని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు కలిసారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రశంసలు కురిపించారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలోతెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి నేతలు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## భారత్‌ను అమెరికాకు అమ్మేశారు

మోదీపై విమర్శల దాడి చేశారు. మోదీ రాజీపడ్డారని, అమెరికా ఒత్తిడికి తలవంచారని ఆరోపించారు. భోపాల్‌లో మంగళవారంనాడు జరిగిన కాంగ్రెస్ కిసాన్ మహాచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశాన్ని అమ్మేశారని, భారతీయుల డాటాను అమెరికా చేతిలో పెట్టారని మోదీని విమర్శించారు. 'వ్యవసాయం, వ్యవసాయ ఉత్పత్తులతో ముడిపడిన కారణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయింది. పార్లమెంటు ప్రసంగంలో కేవలం ఆర్మీ మాజీ చీఫ్ నవరణెళి గురించే నేను మాట్లాడలేదు. నా ప్రసంగం పూర్తికాగానే సొంత మంత్రులను కూడా సంప్రదించ కుండా మోదీ ట్రంప్‌తో మాట్లాడారు. మహిళా ఎంపీలు దాడి చేయాలనుకున్నారంటూ అబద్దాలు చెప్పారు. దానికి బదులుగా అమెరికాతో డీల్‌కు రెడీగా ఉన్నట్టు ఆయన సూటిగా చెప్పి ఉండవచ్చు. మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపించింది' అని రాహుల్ అన్నారు.అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో ఆదేశంతో ట్రేడ్ ఒప్పందాలను వదులుకోవాలని ఇతర దేశాలు నిర్ణయం తీసుకుంటే, మోదీ మాత్రం మౌనంగా ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. 'ఇదే వేదిక నుంచి మోదీని సవాలు చేస్తున్నాను. డీల్‌పై అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున ఆ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. ట్రంప్ ఒత్తిడి కారణంగానే డీల్‌ను మోదీ రద్దు చేసుకున్నారు. భారతదేశం అత్యధిక జనాభా కలిగిన దేశం. డాటా కూడా పెద్దదే. కానీ మోదీ మన డాటాను అమెరికాకు ఇచ్చేశారు. ఆయన మీద ఒత్తిడి లేకపోతే ఆ పని చేసేవారు కాదు. తన ప్రతిష్ట, రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు దేశాన్ని ఆయన అమ్మేశారు' అని మోదీపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.

## జిహెచ్ఎంసిలోనూ పాగా వేస్తాం

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మి ఆలయం ఎంతో పవర్‌ఫుల్ అని, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో ఈ ఆలయాన్నీ గో÷-డలెన్ టెంపుల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మి అమ్మవారు రక్షణగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్రజా సంగ్రామ యాత్రను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రారంభించామని, కేసీఆర్ ప్రభుత్వ అడ్డంకులను ఎదుర్కొని 1640 కిలోమీటర్ల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామని బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్‌లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్.. ఆలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం, బంజారాహిల్స్ పెద్దమ్మ ఆలయం, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయన్నారు. బాన్సువాడలో హిందువులపై రాళ్లదాడి జరిగినా బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని, అమాయకులను అరెస్ట్ చేయడం సరికాదని కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలీసులు అక్రమ అరెస్టులను ఆపాలని హెచ్చరించారు. అవసరమైతే తానే బాన్సువాడకు వెళ్లి హిందువులకు రక్షణగా నిలుస్తానన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉద్యోగులకు బకాయిలు, మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

### - భారీగా ఏర్పాట్లు చేసిన బోర్డు

### - పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**
ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25, బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ప్రథమ, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1495పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్‌లో 489126 మంది, సెకండియర్‌లో 507949 మంది కలిపి మొత్తం 997075 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థుల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, గోడ గడియారాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళన, మానసిక ఆవేదన లాంటి సమస్యలను అధిగమించేందుకు 14416, 80693 91416 నెంబర్లను అందుబాటులోకి తెచ్చామని, విద్యార్థులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ సేవలు పొందవచ్చని కృష్ణ ఆదిత్య తెలిపారు.

## మావోయిస్ట్ పార్టీకి భారీ దెబ్బ

కమాండర్‌గా పనిచేశారు. 1989లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2001లో సెంట్రల్ కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడిగా, 2017లో సీఎంసీ ఇన్‌ఛార్జ్‌గా, తర్వాత పొలిట్ బ్యూరో సభ్యుడిగా(పీబీఎం) ఎదిగారు. 1970లలో ఉద్యమంలోకి వచ్చిన మల్లారాజి రెడ్డి..1980లలో డివిజనల్ కమిటీ, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. 1990లో సీసీఎంగా నియమితులయ్యారు. మహారాష్ట్ర, దండకారణ్య ప్రాంతాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2007లో పీబీ సభ్యత్వం, 2010-16 మధ్య ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. 1996లో ఆర్ఎస్‌యూ ద్వారా పార్టీలో చేరి 1999-2000లో ఏటూరునాగారం-మహాదేవపూర్ ప్రాంతాల్లో పార్టీ సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ, ఇతర ప్రాంతీయ కమిటీలలో కీలక బాధ్యతలు చేపట్టారు. నూనె నరసింహా రెడ్డి కూడా రాష్ట్ర కమిటీ స్థాయిలో కీలక పాత్ర పోషించారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురినీ మంగళవారం మీడియా ముందుకు తీసుకువచ్చారు.

### ప్రజాజీవితంలోకి రావాలనే అజ్ఞాతం వీడాం

మావోయిస్ట్ పార్టీకి చెందిన అగ్రనేతలు డిజిపి ఎదుట లొంగిపోయారు. అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ సందర్భంగా దేవ్‌జీ మీడియాతో మాట్లాడుతూ.. 'అనారోగ్య కారణాల రీత్యా నేను లొంగిపోయాను. రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితం గడపాలని భావిస్తున్నాను. దశాబ్దాల కాలం నుంచి నేను నమ్మిన సిద్ధాంతాల ప్రకారమే ప్రజల కోసం పనిచేస్తాను. ప్రజల సమస్యలపై ప్రజల్లో ఉండి పోరాటం చేస్తాను. త్వరలో రాజకీయ ప్రవేశం చేసి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని భావిస్తున్నాను. మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పే పరిస్థితిలో లేను. నేను ఏది మాట్లాడినా అపార్థాలకు దారితీసే విధంగా ఉంటుంది. నేను రాజకీయ జీవితం కొనసాగించాలని కోరుకుంటున్నాను. మీరడిగే ప్రశ్నలకు నేను చెప్పే జవాబు.. రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించవద్దని అన్ని విషయాలు పంచుకోవడం లేదు' అని అన్నారు. మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసి పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

## మీ అరచాకాలను ఇక సహించేది లేదు

నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీల్లో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోట్లకుగానూ 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు. 'మరికొన్ని మున్సిపాలిటీల లోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు. నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.

## ఎంతకాలం ఉంటానో తెలియదు..

డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడిన ఘటనపై స్పందిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మార్-ఎ-లాగో రిసార్ట్ లోకి తుపాకీతో చొరబడేందుకు ప్రయత్నించిన ఆగంతుకుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్చి చంపిన ఘటనపై డొనాల్డ్ ట్రంప్ తొలిసారి స్పందించారు. ఈ భద్రతా లోపంపై ఆయన కాస్త ఆందోళన, మరికాస్త వ్యంగ్యంగా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. వైట్ హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. నేను ఇంకా ఎంతకాలం ఇక్కడ ఉంటానో నాకు తెలియదు. నా కోసం తుపాకులు పట్టుకుని ఎంతమంది వేచి చూస్తున్నారో చూశారుగా ?' అని వ్యాఖ్యానించారు. గొప్ప నాయకులకే ఇలాంటి ముప్పు ఉంటుందని, అబ్రహం లింకన్, కెన్నడీ వంటి 'ప్రభావశీల' అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని చెప్పారు. బహుశా నేను కొంచెం తక్కువ ప్రభావశీల నాయకుడిగా ఉంటే బాగుండేదేమో.. కాసేపు సాధారణ అధ్యక్షుడిలా ఉందాం అని చమత్కరించారు. ఫిబ్రవరి 22 తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో ఆస్టిన్ టక్కర్ మార్టిన్ (21) అనే యువకుడు షాట్ గన్, ఇంధనం క్యాన్‌తో మార్-ఎ-లాగో ప్రహరీని దాటేందుకు ప్రయత్నించాడు. భద్రతా దళాలు హెచ్చరించినప్పటికీ, అతడు లొంగకుండా తుపాకీని ఎక్కుపెట్టడంతో సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మార్టిన్ అక్కడికక్కడే మరణించాడు. ఆ సమయంలో ట్రంప్ దంపతులు వైట్ హౌస్‌లో ఉన్నారు. గతంలో కూడా ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో చనిపోయిన యువకుడు ఎప్ స్టీన్ ఫైల్స్ విడుదలకు సంబంధించి ప్రభుత్వంపై అసహనంతో ఉన్నట్లు కొన్ని టెక్స్ట్ మెసేజ్‌ల ద్వారా వెల్లడయ్యింది.తనపై జరుగుతోన్న వరుస హత్యాయత్నాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. తనను హత్య చేయడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నారని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే తాను ఎంత కాలం ఉంటానో కూడా తెలియట్లేదన్నారు. ఇటువంటి షూటర్లు సాధారణ అధ్యక్షుల జోలికి వెళ్లరని.. కేవలం అసాధారణ విజయాలు సాధించే అధ్యక్షులనే లక్ష్యంగా చేసుకుంటారని అన్నారు. ఇలాంటి ఎన్ని బెదిరింపులకు పాల్పడినా.. తాను తీసుకునే నిర్ణయాలపై ఏ మాత్రం వెనక్కి తగ్గబోనన్నారు.2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఆ ఘటనలో ట్రంప్ చెవి భాగం నుంచి తూటా దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓసారి ట్రంప్ పామ్ బీచ్ గోల్ఫ్ కోర్స్‌లో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో దోషులకు శిక్షపడాల్సిందే

కదా?' అని పవన్ అన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్దాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది..



వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు.రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## వైకాపా హయాంలో కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూల తయారీ

విషయాల్లో తప్పులు చేశారు. 2019-24 మధ్య 59.71లక్షల లీటర్ల కల్తీ నెయ్యి వినియోగించారు. రూ.231.51 కోట్ల అక్రమాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను నీరుగార్చారు. ఒక పద్ధతి ప్రకారం లాలూచీ పడిన లూటీ అని స్పష్టంగా తేలింది. కల్తీ నెయ్యి అని నిర్ధారణ అయినా రిపోర్టును తొక్కిపెట్టారు. లడ్డూలో జంతుకొవ్వు కలిసిందని నేను సొంతంగా ఏమీ చెప్పలేదు. ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టునే చెప్పా. ఆ భగవంతుడే నాతో చెప్పించాడని చంద్రబాబు అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 - 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. అఈ÷ఖీఎ ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ఎ÷-లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు ఛైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ ఛైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గుర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.నాటి టీటీడీ ఛైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు వివరించారు.

వెలుతురు



## డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో ఆదర్శంగా నిలిచిన పీసీసీ అధ్యక్షుడు, బట్టి విక్రమార్క

**వికారాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ శిబిరాల్లో భాగంగా మధ్యాహ్న భోజనం అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ బట్టి విక్రమార్క గారు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ గారు తాము ఉపయోగించిన ప్లేట్లను స్వయంగా కడిగి నిర్ణీత స్థానంలో ఉంచారు. శిబిరంలో క్రమశిక్షణ, స్వీయ బాధ్యత భావనలను పెంపొందించే ఉద్దేశంతో ప్రతిరోజు ప్రతి డీసీసీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు తాము తిన్న ప్లేట్లను తామే కడుక్కోవడం శిక్షణ కార్యక్రమంలో భాగంగా అమలు చేయబడుతోంది. నేతలు స్వయంగా ఇలా ఆదర్శంగా ముందుండటం శిబిరంలో పాల్గొన్న కార్యకర్తలకు ప్రేరణగా నిలిచింది.

# ఆదిలాబాద్ అభివృద్ధికి మైలురాయి ఎయిర్‌పోర్టు





**ఆదిలాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
మంగళవారం రోజున ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతిపాదిత ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమైన సమీక్షా మరియు సమన్వయ సమావేశం నిర్వహించబడింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నాగేష్, ఎమ్మెల్యే ఆదిలాబాద్ పాయల్ శంకర్ పాల్గొన్నారు. సమావేశంలో భూ సేకరణకు సంబంధించిన సవాళ్లు, మాస్టర్ ప్లాన్ పరిధిలో వివిధ శాఖలు ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టు కారణంగా ప్రభావితమయ్యే ఆస్తులు, రహదారులు మరియు భవనాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిలాబాద్ పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఈ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు ఆదిలాబాద్ జిల్లా భవిష్యత్తును పూర్తిగా మార్చే అభివృద్ధి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు పెరగడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు. మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆర్ & బి, మిషన్ భగీరథ తదితర శాఖలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావాలంటే అధికారులంతా ఒకే దిశగా కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు మాస్టర్ ప్లాన్ తుది ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. జిల్లా పరిపాలన అందిస్తున్న సహకారానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీ రెవెన్యూ ఏసీ లోకల్ బాడీస్ ఆర్డీఓ, ఆదిలాబాద్ ఎస్ఈ విద్యుత్ శాఖ అధికారులు ఆర్ & బి అధికారులు మున్సిపల్ అధికారులు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి.. అభివృద్ధి వ్యూహం

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**
తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి ఒక శాఖ మాత్రమే కాదు అభివృద్ధి వ్యూహంగా మారిందన్నారు కార్మిక శాఖా మంత్రి డా. జీ వివేక్ వెంకటస్వామి. గత కొన్ని సంవత్సరాలుగా ఐటీఐలు మరియు శిక్షణా మౌలిక వసతులను ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్డ్ స్కిల్ సెంటర్లు గా మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, డిజిటల్ పరికరాలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన పాఠ్య ప్రణాళికలను అమలు చేస్తున్నామని వివరించారు. కన్హా శాంతి వనంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ కాంపిటిషన్ 2025?26 దక్షిణ ప్రాంత పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఎ÷–లాయ్మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ క్రాంతి వేస్లీ, ఐఏఎస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సౌత్ ఇండియా స్థాయి పోటీలలో మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో 350కి పైగా పోటీదారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్యంగా 123 మంది యువతులు పాల్గొనడం ప్రోత్సాహకరంగా నిలిచింది. సంప్రదాయంగా పురుషాధిక్యంగా భావించే కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్స్, ప్లంబింగ్, హీటింగ్ వంటి రంగాల్లో 20 మంది మహిళలు పోటీ చేయడం సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలిచింది. 3డి డిజిటల్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోనమస్ మొబైల్ రోబోటిక్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, కేబినెట్ మేకింగ్, కార్పెంట్రీ తదితర విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు మంత్రి గారు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ఈ రోజు కేవలం సర్టిఫికెట్ల గురించినది కాదు. ఇది కృషి, క్రమశిక్షణ, అంకితభావం మరియు ప్రతిభను గౌరవించే రోజు. ఇక్కడ ఉన్న యువతను చూసినప్పుడు దేశ భవిష్యత్తుపై అపారమైన విశ్వాసం కలుగుతోంది అన్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తోందని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కరణ సామర్థ్యం, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను శిక్షణలో భాగం చేశామని మంత్రి తెలిపారు.

హైదరాబాద్ ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేంద్రంగా ఎదిగిందని, అందుకే ఏఐ, రోబోటిక్స్, మెకాట్రానిక్స్, డేటా అనలిటిక్స్, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. 'నైపుణ్యాభివృద్ధి కేవలం ఉపాధి కోసం మాత్రమే కాదు, సాధికారత కోసం కూడా. ఒక యువకుడు లేదా యువతి నైపుణ్యం నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, గౌరవం వస్తుంది, స్వతంత్రత సాధ్యమవుతుంది. నైపుణ్యం ఉన్న వారు అవకాశాల కోసం ఎదురుచూడరు, వారు అవకాశాలను సృష్టిస్తారని మంత్రి స్పష్టం చేశారు.

## త్వరలోనే రైతు భరోసా నిధుల విడుదలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు హామీ

**- టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి వెల్లడి**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులను త్వరలోనే విడుదల చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చినట్లు టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో మంగళవారంనాడు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరుతూ ఈమేరకు వినతి పత్రంను సమర్పించినట్లు శేర్ నర్సారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించి వ్యవసాయాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో రైతులకు వ్యవసాయ సాగు ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. గతంలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రభుత్వ అవసరాల కోసం భూములు ఇచ్చిన వారికి, వ్యవసాయ పంటలు సాగు కానీ బీడు భూములకు, రాళ్లు, రప్పలు, బంచరాయి తదితర భూములు గల వారికి రైతుబంధు డబ్బులను భూస్వాముల అకౌంట్లలో జమ చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనీ అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా అలాంటి పరిస్థితి రానివ్వకుండా వ్యవసాయ పంటలు సాగు చేసే వారికి నిజమైన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు, ఈ మేరకు త్వరలోనే రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం రైతుల అకౌంట్లో జమ చేసేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీని ఇచ్చినట్లు టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి పేర్కొన్నారు.

# 5 నిముషాల ఆలస్యాన్ని పరిగణిస్తాం



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్ట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గా÷–జడెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమ్జ్గ÷న్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా ఖి.ఖీ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు. మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు.



# సంపాదకీయం.. ప్రజల పాలిట పాలకూట విషం

కల్తీకి కాదేదీ అర్హం అన్న రీతిలో... ఆహారా పదార్థాల కల్తీ విపరీతం అయ్యింది. అడపాదడపా దాడుల్లో కల్తీలు బయటపడుతున్నా కఠిన చర్యలు కనిపించడం లేదు. కల్తీ చేస్తున్న దగుల్బాజీల్లో భయం కనిపించడం లేదు. కల్తీ కల్లుకు బలవుతున్నారు. కల్తీ మద్యానికి బలవుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు బలవుతున్నారు. చివరకు పాలు కూడా కల్తీ చేస్తున్నారు. యూరియా లాంటివి కలిపి కృత్రిమ పాలతో ప్రజల ప్రాణాలు తోడేస్తున్నారు. నిత్యం తాగే పాలను సైతంకల్తీ చేస్తున్న ఘటన వెలుగులోకి రావడం దారుణం. కల్తీ పాల కారణంగా ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడ్డారు. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మరణించడం బాధాకరం. స్వచ్ఛతకు మారుపేరుగా పాలను పేర్కొంటారు. అటువంటి పాలను అమితమైన లాభార్జన కోసం కాలకూట విషం కావించడం అమానవీయం. ఒకప్పుడు పాలల్లో నీళ్లు కలపడాన్ని పెద్ద నేరంగా పరిగణించేవారు. ఇప్పుడు పాలంటే హడలెత్తే స్థితికి కల్తీ దందా చేరుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పాలు ప్రజలకు నిత్యావసర వస్తువు. పసికందుల దగ్గర నుంచి వృద్ధుల వరకు పాలే జీవనాధారం. పాలు తాగితే చాలా వరకు మన శరీరానికి కావాల్సిన సంపూర్ణ పోషకాలు సమకూరుతాయన్నది ఆరోగ్య నిపుణుల మాట. అటువంటి పాల వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ అంతంత మాత్రమే. ఎవరైనా డెయిరీ పెట్టవచ్చు. పాలు సరఫరా చేయవచ్చు. అందులో ఏం కలుస్తున్నాయో తెలియడం లేదు. నేరుగా గేదె పాలు పోస్తున్నారన్న నమ్మకంతో ప్రజలు డబ్బాల్లో వచ్చే పాలను ఆశ్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు అడ్రస్ లేకుండా పోయారు. వాటిపై పర్యవేక్షణ ఎవరిదన్న విషయం తెలియదు. కాలం చెల్లిన, నాసిరకం, కల్తీ పాలను గుర్తించే వ్యవస్థ అసలు ఉందా అన్నదే అనుమానం. గతంలో రైతులు



తమకు తాముగా నిర్వహించుకునే సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పాల కల్తీ ఉండేది కాదు. ఎప్పుడైతే ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుల్లా పుట్టుకొచ్చాయో అప్పటి నుంచి కల్తీ విచ్చలవిడైందన్న ఆరోపణలు బాగా ముందుకొచ్చాయి. పాడి-పంట.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుతో విడదీయరాని బంధం. గ్రామీణ మహిళలే పాడిని నిర్వహిస్తారు. కానీ కష్టపడి పాలను ఉత్పత్తి చేసిన రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వారి వద్ద నుంచి పాలను సేకరించిన ప్రైవేటు డెయిరీలకు మాత్రం లాభాల పంట పండుతుంది. రోజూ ఉత్పత్తవుతున్న పాలల్లో ప్రైవేటు, సహకారం రెండూ కలిపినా కూడా సంఘటితరంగం కిందికొచ్చేవి సగం కూడా లేదన్నది ప్రభుత్వ అంచనా. ప్రభుత్వం దశలవారీగా సహకార రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ప్రైవేటు ఆధిపత్యం అంతకంత కూ పెరుగుతోంది. డెయిరీల మధ్య అనారోగ్య పోటీ నెలకొంది. డెయిరీ ప్రైవేటీకరణ కాస్తా కార్పొరేటీకరణ బాట పట్టింది.

ఎప్పుడైతే పరిస్థితి మారిందో చిన్నా చితకా డెయిరీలు సైతం లాభాల కోసం అడ్డదారులు తొక్కుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. రాష్ట్రంలో పాడిపశువుల సంఖ్యపై అనుమానా లున్నాయి. ప్రజల ఆరోగ్యాలను హరించే సింథటిక్ పాలు, యూరియా వంటి రసాయనాలతో తయారు చేసిన పాలు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయన్న ఫిర్యాదులొస్తున్నాయి. పాల వ్యాపారులు ఏకంగా కృత్రిమ పాలను ఉత్పత్తి చేస్తున్నట్లు కనిపిస్తుంది. దీనికితోడు తనిఖీ బాధ్యతను ఆయా సంస్థలకే వదిలేసినట్లు కనిపిస్తుంది. పాలతో సహా యావత్ ఫుడ్ సేఫ్టీ బాధ్యత ప్రభుత్వానిదే అయినా ఎక్కడా అజమాయిషీ కనిపించడం లేదు. . అందుకు పటిష్టమైన వ్యవస్థ అవసరం. లేదంటే ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందనడానికి రాజయమండ్రి ఘటనే నిదర్శనం. రాజమహేంద్రవరం కేసులకు సంబంధించిన ఇప్పటికీ ఇద్దరు వెంటిలేటర్‌పై ఉండగా, ఎనిమిది మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒకే వ్యక్తి నుంచి పాలు కొనుగోలు చేసిన వారిలో ఈ వ్యాధి ముదరి ఆస్పత్రి పాలయ్యారు. అనూరియా అంటే మూత్ర విసర్జన ఆగిపోవడం వంటి జబ్బుతో పలువురు ఆస్పత్రిలో చేరారు. రాజమండ్రి నగర శివారుకు చెందిన డజను మంది అనూరియా లక్షణాలతో ఆదివారం ఒకేసారి ఆస్పత్రులల్లో చేరడంతో కలకలం లేచింది. పరిస్థితి డయాలసిస్, కిడ్నీల ఫెయిల్యూర్ వరకు వెళ్లడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అనారోగ్యం పాలైన వారు వృద్ధులు, చిన్నారులే కావడం పెద్ద విషాదం. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కారణాలను అన్వేషించే పనిలో పడింది. కోరుకొండ మండలం పర్సాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి డెయిరీ నుంచి సరఫరా అయిన కల్తీ పాలే పలువురి అస్వస్థతకు మూలమని ప్రాథమికంగా గుర్తించారు. డెయిరీ నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగుతున్నారు. కల్తీ పాల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించడం తో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తానని పేర్కొంది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన మండలిలో హోం మంత్రి అనిత ప్రకటనలు చేశారు. దీనిని ఇంతటితోనే విదిలేస్తే సరిపోదు. పాల సరఫరాచేస్తున్న వారిపై నిఘా పెట్టాలి. కల్తీ పాల వ్యవహారాన్ని గుర్తించాలి. నిజానికి పాడిగేదెలు ఎన్ని ఉన్నాయి..ఎక్కడెక్కడ నుంచి పాలు వస్తున్నాయో వివరాలను ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చేస్తే మంచిది. పాల కల్తీ జనాన్ని కలవర పరుస్తోంది. కాసుల కక్కుర్తితో కొందరు ఈ పాపానికి ఒడిగడుతున్నారు. అనుమతి లేని కేంద్రాలను నడుపుతూ జనం ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పటిష్ఠ తనిఖీలు, కఠిన శిక్షలు లేకపోవడంతో పాల కల్తీకి అడ్డుకట్ట పడడం లేదు. జిల్లాల్లో అవసరాలకు, ఉత్పత్తికి భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్యాకేజ్డ్ పాల ద్వారా కొంత అవసరాలు తీరుతుండగా.. మిగతా పాలు ఎక్కడివనే తీవ్ర అనుమానాలు రేకెత్తుతున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కొందరు కాసుల కక్కుర్తితో కల్తీకి పాల్పడుతున్నారు. రెండు లీటర్ల పాలల్లో యూరియా, బియ్యం పిండి, సోడా వంటివి కలిపి 5 నుంచి 6 లీటర్లుగా తయారు చేస్తున్నారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లపై నిషేధమున్నా.. పాల దిగుబడి పెంపునకు రహస్యంగా తెచ్చి గేదెలకు ఇస్తున్నారు. గ్లూకోజ్, సోడియం, హైడ్రాక్సైడ్, గంజి పౌడరు, జంతువుల కొవ్వు కొన్ని రకాల పాల పొడులను పాలలో కలిపేస్తున్నారు. రసాయనాలతో వ్యాధుల ముప్పు: కల్తీ పాలతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. చిక్కదనం కోసం వాడే యూరియా మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. నిల్వ కోసం కలిపే వాడే ఫార్మలిన్ అనే రసాయనంతో జీర్ణకోశ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. రసాయనాలతో ఉదర, కాలేయ సంబంధిత సమస్యలొస్తాయి. రాజమండ్రిలో మాత్రమే ఇప్పుడు బయటపడ్డది. ప్రభుత్వం మేలుకోకుంటే మరిన్ని ఘటనలు రావచ్చు.

# "దేవుడి దర్శనం, కుల గర్వం, పసిప్రాణ హత్య తెలంగాణ సమాజపు అంతర్గత రుగ్మత"



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

**తెలంగాణలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత "సామాజిక న్యాయం", "బడుగు వర్గాల అభ్యుదయం", "సమానత్వం" వంటి పదాలు రాజకీయ నినాదాలుగా మారాయి. కానీ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన పసిప్రాణ హత్య ఘటన ఆ నినాదాలను నైతిక అద్దంలో నిలబెట్టింది. దేవుడి దర్శనానికి వచ్చిన ఒక రజక కుటుంబాన్ని కులం పేరుతో అవమానించి, మహిళలపై దాడి చేసి, తమ్ముడిని నిర్బంధించి, చివరకు రెండు నెలల పసిబిడ్డను కాలితో తన్ని చంపిన ఘటన ఒక గ్రామపు సంఘటన కాదు, అది భారతీయ సమాజపు అంతర్గత రుగ్మతకు ప్రతీక.**

**ఈ ఘటనలో బాధ కలిగించేది హింస మాత్రమే కాదు. బాధ కలిగించేది ఆ హింస వెనుక ఉన్న సామాజిక నిర్మాణం, ఆ హింసను అడ్డుకోలేని పాలనా వ్యవస్థ, ఆ హింసను ప్రశ్నించడంలో ఆలస్యం చేసిన రాజకీయ నాయకత్వం, ఆ హింసపై న్యాయం చేయడంలో సందిగ్ధంగా వ్యవహరించిన పోలీసు వ్యవస్థ. ఇది ఒక వ్యక్తి చేసిన నేరం కాదు, ఇది ఒక వ్యవస్థ చేసిన నేరం.**

కుమ్మెర జాతరలో వంద రూపాయల టోకెన్, దేవుడి దర్శనం, కులంఈ మూడు పదాలు కలిసి ఒక పసిప్రాణాన్ని బలి తీసుకున్నాయి. "మీరు తక్కువ జాతి, దేవుడిని చూడటానికి అర్హులు కాదు" అనే మాటలు కేవలం అవమానం కాదు, అవి ఒక తాత్విక సిద్ధాంతం యొక్క ప్రతిబింబం. దేవుడిని కూడా కులంగా విభజించే సమాజం, దేవుడి ముందు కూడా మనుషులను అసమానంగా చూడగల సమాజం, నిజంగా ఏ దేవుడిని పూజిస్తోంది? దేవుడి ముందు సమానత్వం కూడా లేని సమాజం, రాజ్యాంగ సమానత్వాన్ని ఎలా అంగీకరిస్తుంది?


మన సమాజం తనను తాను ఆధునికంగా భావించుకుంటుంది. అంతరిక్ష పరిశోధనలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ఇండియా, గ్లోబల్ ఎకానమీఇవి మన గర్వకారణాలు. కానీ అదే సమాజం తన గ్రామాల్లో ఇంకా మనుషులను కులాలుగా వర్గీకరిస్తే, వారి జీవితం, గౌరవం, హక్కులు కుల ఆధారంగా నిర్ణయిస్తే, మన నాగరికత కేవలం టెక్నాలజీ ముసుగు వేసుకున్న మానవత్వ రాహిత్యమా అనే ప్రశ్న తప్పదు. ఒక పసిప్రాణం కన్నా కుల గర్వం ఎక్కువ విలువైన సమాజం, నిజంగా నాగరిక సమాజమేనా?

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కులాన్ని "హిందూ సమాజపు అంతర్గత శత్రువు"గా అభివర్ణించారు. ఆయన దృష్టిలో కులం ఒక సామాజిక విభజన మాత్రమే కాదు, అది ఆర్థిక అసమానత, రాజకీయ అసమానత, నైతిక పతనం, మానవ హక్కుల ఉల్లంఘన కలసిన ఒక సమగ్ర వ్యవస్థ. "కులం అనేది శ్రమ విభజనలో హైరార్కీ" అన్న ఆయన వ్యాఖ్య కుమ్మెర ఘటనలో ప్రత్యక్షంగా కనిపిస్తుంది. కొన్ని కులాలు పైగా, కొన్ని కులాలు కిందగాఈ భావజాలం మనుషులను సమాన పౌరులుగా కాకుండా, వర్గీకృత జీవులుగా చూసే మానసిక నిర్మాణాన్ని రూపొందించింది. ఈ నిర్మాణం వల్లే ఒక వ్యక్తి మరో వ్యక్తిని దేవుడి దర్శనానికి కూడా అర్హుడిగా చూడకుండా, పసికూన ప్రాణానికే తక్కువ విలువ చేసి చూసింది .

భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే మౌలిక విలువలను ప్రకటించింది. రాజ్యాంగం ముందు అందరూ సమానులే. కానీ రాజ్యాంగం పుస్తకాల్లో ఉంది, గ్రామపు అంచుల్లో అది కనిపించదు. చట్టాలు ఉన్నాయి, కానీ మనసులు మారలేదు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఉంది, కానీ దాని అమలు రాజకీయ ప్రభావాలకు లోబడి ఉంది. ఇది భారతీయ ప్రజాస్వామ్యపు లోపలి ఖాళీ. రాజ్యాంగం ఒక నైతిక పత్రం, కానీ ఆ నైతికత సమాజపు మానసిక నిర్మాణంలోకి చొరబడలేకపోయింది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సామాజిక న్యాయం, బడుగు వర్గాల అభ్యుదయం అనే నినాదాలు ఇచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దళిత ఎంపీ మల్లురవి, నాగర్ కర్నూల్ ప్రాంత ఎమ్మెల్యే, ఈ నినాదాల రాజకీయ ప్రతినిధులు. కానీ ఈ ఘటన వారి రాజకీయ నినాదాలకు ఒక నైతిక పరీక్ష. గతంలో పార్లమెంట్లో కుల అవమానాలపై మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి. ఆయన మాటలు, ఆయన రాజకీయ ప్రయాణం, ఇప్పుడు ఒక గ్రామపు పసిప్రాణం ముందు నిలబడి ఉన్నాయి. నినాదాలు పాలనను నిర్వచించవు, చర్యలు నిర్వచిస్తాయి. ఈ ఘటనపై మౌనం, ఆలస్యం, అస్పష్ట స్పందనలు రాజకీయ నైతిక వైఫల్యానికి సంకేతం.

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే, ఎంపీ మల్లురవి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం, ఘాటైన రాజకీయ ప్రకటనలు లేకపోవడం ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఒక దళిత ఎంపీ ఉన్న ప్రాంతంలో ఒక దళిత కుటుంబం, ఒక బడుగు వర్గ కుటుంబం ఇలాంటి దారుణానికి గురైతే, అది రాజకీయ ప్రతినిధిత్వం యొక్క అర్థాన్ని ప్రశ్నిస్తుంది. ప్రతినిధిత్వం కేవలం పదవులు కాదు, అది బాధ్యత. బాధ్యత అంటే బాధితుల పక్షాన నిలబడడం. రాజకీయ నాయకత్వం మౌనం పాటిస్తే, అది అధికార మౌనం కాదు, అది నైతిక మౌనం.



ఈ ఘటనలో పోలీసు వ్యవస్థ పాత్ర అత్యంత ఆందోళనకరం. బాధితులపై కేసులు నమోదు చేయడం, హంతకులపై ఆలస్యం చేయడం, ఎనిమిది మందిపై ఫిర్యాదు చేస్తే నలుగురినే అరెస్టు చేయడం, మిగిలినవారిని కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వెలుస్తున్నాయి. ఇవి న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కూల్చుతున్నాయి. "చట్టం ముందు అందరూ సమానులు" అనే సిద్ధాంతం పోలీసు స్టేషన్ తలుపుల వద్దనే ఆగిపోతుందా? శక్తివంతులకు న్యాయం, బలహీనులకు కేసులు,ఇది ప్రజాస్వామ్యపు అపహాస్యం.

డిఎస్పీ స్థాయిలో నిర్లక్ష్యం, రాజకీయ ప్రభావంఈ కేసులో కనిపిస్తున్నాయనే ఆరోపణలు పోలీసు వ్యవస్థ స్వతంత్రతపై ప్రశ్నలు వేస్తున్నాయి. పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణ కోసం, శక్తివంతుల సేవ కోసం కాదు. కానీ వాస్తవంలో పోలీసు వ్యవస్థ శక్తివంతుల రాజకీయ ప్రభావానికి లోబడి ఉంటే, అది రాజ్యాంగానికి చేసిన ద్రోహం. పసిప్రాణం హత్య వంటి ఘటనలో కూడా స్పష్టమైన హత్యా సెక్షన్లు పెట్టడంలో ఆలస్యం చేయడం, బాధితులపై ప్రతికేసులు పెట్టడం న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని నాశనం చేస్తుంది.

కుమ్మెర ఘటన ఒక వార్త కాదు,అది ఒక సామాజిక ప్రకటన. ఇది ఒక సామాజిక సిద్ధాంతం విఫలమవడం. ఇది ఒక నైతిక వ్యవస్థ పతనం. ఇది ఒక ప్రజాస్వామ్యపు లోపలి ఖాళీ. మన సమాజం తరచుగా హింసను వ్యక్తిగత నేరంగా చూస్తుంది. కానీ కుల ఆధారిత హింస వ్యక్తిగత క్రూరత్వం మాత్రమే కాదు, అది సామాజిక నిర్మాణం యొక్క ఫలితం. ఒక వ్యక్తి పసిప్రాణాన్ని తన్నే స్థాయికి దిగజారితే, ఆ వ్యక్తి మాత్రమే కాదు, ఆ వ్యక్తిని రూపొందించిన సమాజం, ఆ వ్యక్తిని అడ్డుకోలేని పాలనా వ్యవస్థ, ఆ వ్యక్తిని శిక్షించడంలో ఆలస్యం చేసే న్యాయవ్యవస్థ, అన్ని కలిసి బాధ్యత వహించాలి. ఇది సమాజపు సమిష్టి వైఫల్యం.

బహుజన సమాజం, మేధావులు, రచయితలు, మీడియా, సామాజిక కార్యకర్తలు ఈ ఘటనపై ప్రశ్నించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. మౌనం కంటే ప్రశ్నించడం గొప్పది. కులాధిపత్యంపై మౌనం కొనసాగితే, అది ఆ వ్యవస్థకు మౌన అనుమతినిచ్చినట్టే. ఈ రోజు ఒక కుటుంబం బాధపడింది, రేపు ఇంకో కుటుంబం బాధపడుతుంది. కాబట్టి ఈ ఘటనను ఒక వార్తగా కాదు, ఒక సామాజిక పిలుపుగా చూడాలి.

పరిష్కారం చట్టంలో మాత్రమే లేదు, మనసుల్లో ఉంది. చట్టాలు కఠినంగా అమలవ్వాలి. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలి. భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 103 ప్రకారం హత్య కేసు నమోదు చేసి, వేగవంతమైన విచారణ జరిపి, ఉదాహరణాత్మక శిక్ష విధించాలి. బాధితులకు రక్షణ కల్పించాలి. సాక్షులకు భద్రత ఇవ్వాలి. రాజకీయ ప్రభావం లేకుండా స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలి. కానీ ఇవి తాత్కాలిక పరిష్కారాలు మాత్రమే.

శాశ్వత పరిష్కారం సామాజిక మార్పులో ఉంది. పాఠశాలల నుంచి కుల వ్యతిరేక విద్య, మానవ హక్కుల విద్య అమలు చేయాలి. పాఠ్యపుస్తకాల్లో అంబేద్కర్, ఫూలే, పెరియార్ వంటి సమానత్వ ఆలోచనలను బలంగా చేర్చాలి. మతపరమైన, సామాజిక వేడుకల్లో సమానత్వాన్ని బలపరచాలి. దేవుడి ముందు కులం అనే భావనకు ముగింపు పలకాలి. రాజకీయ నాయకులు కుల రాజకీయాలను వదిలి, సమానత్వ రాజకీయాలను ఆచరణలో పెట్టాలి. మీడియా సంచలనాత్మకమైన వార్తలకే కాకుండా, సామాజిక చైతన్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కుల ఆధారిత హింసను ఒక నేరంగా కాకుండా, ఒక సామాజిక వ్యాధిగా చూపించాలి. మేధావులు, రచయితలు, కళాకారులు కులాధిపత్యంపై నిరంతరం ప్రశ్నించాలి. సాహిత్యం, కళ, సినిమా, అన్ని సామాజిక మార్పుకు ఆయుధాలుగా మారాలి.

కుమ్మెర ఘటన మన సమాజానికి ఒక నైతిక అద్దం. ఈ అద్దంలో మనం చూసేది మన నాగరికత యొక్క అసలు ముఖం. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే విలువలు గ్రామాల్లో అమలవ్వని వరకు, భారతీయ ప్రజాస్వామ్యం అసంపూర్ణమే. ఒక పసిప్రాణం కోసం, ఒక కుటుంబం కోసం, ఒక సమాజం కోసంన్యాయం కోసం ప్రశ్నించడం ప్రతి పౌరుడి బాధ్యత.

మౌనం కూడా ఒక రాజకీయ ప్రకటన. కాబట్టి మౌనం విడిచిపెట్టి, కులాధిపత్యానికి వ్యతిరేకంగా, మానవత్వానికి అనుకూలంగా మనం నిలబడాలి. కుమ్మెర ఘటనను మర్చిపోతే, మనం మన రాజ్యాంగాన్ని మర్చిపోయినట్టే. ఈ ఘటనకు నిజమైన నివాళి ఒక శిక్ష కాదు, ఒక సామాజిక మార్పు. అదే మన నాగరికతకు నిజమైన పరీక్ష అనేది గుర్తుంచుకోవాలని కోరుకుందాం.

# నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర ఘటన అయినటువంటి రెడ్డి బాధ్యులను వెంటనే కఠినంగా శిక్షించాలి

**- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం జెఏసి చైర్మన్ కంబాలపల్లి భాస్కర్**



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 24:**
మంచాల మండల కేంద్రంలో నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెరమల్లి ఖార్జునస్వామి ఘటనలో జరిగి న గొడవలో శిశువ మరణానికి కారణమైన వారిని శిక్షించాలి అంటూనిరసన కార్యక్రమంచేపట్టిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం జెఏసి చెర్మెన్ కంబాలపల్లి భాస్కర్ ఉపాధ్యక్షులు పల్నాటి యా దయ్య జెఏసి మంచాల మండల అధ్యక్షులు దంచుక బిక్షపతి లింగంపల్లి వార్డ్ నెంబర్ ఉద్దగిరి శివ తిప్పాయిగూడెం మాజీసర్పంచ్ చీరల పాండు పల్నాటి శ్రీను గ్యార పాండు స్వామి సురేష్ రాములు పాల్గొనడం జరిగిందిఈ సందర్భంగా మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లి కార్జున స్వామి ఘటనలో జరిగిన గొడవలో కాళ్ళ కింద పడి రెండు నెలల శిశు వు మరణానికి కా రణమైన వారిపైన కఠిన మైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గణేష్ భా ర్య మౌనిక ఆడ శిశువు అని చూడకుండా కాళ్ళతో తన్ని శిశువు మరణానికి కారణమైన వారి పై నాఎస్సీ ఎస్టీ బీసీమైనారిటీ ప్రజలంత ముక్త కంఠతో వ్యతిరేకించారు ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా, ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి గణేష్ మౌనిక కుటుంబాన్నిఆదుకోవాలని అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# చింతపల్లిగూడలో సమస్యలు పరిష్కారం చేసిన అధికారులు

**- నా వార్తకు స్పందించి సమస్యలు పరిష్కారం చేసిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు డాక్టర్ ఉక్కుల అశోక్**



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 24:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చింతపల్లి గూడ గ్రామంలో ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని 54వకొం గరకాలన్ డివిజన్‌లో ఉన్న చింతపల్లిగూడ గ్రామాన్ని గ్రామస్తులతో కలిసి చెత్త చెదారం తొలగిం చి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ ఉక్కుల అశోక్ సంబంధిత అ ధికారు లను కోరారు సమస్యలపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన ఆదిభట్ల సర్కిల్ శానిటే షన్ ఆఫీసర్ డిఈ స్వర్ణకుమార్ మ రియు శానిటేషన్ ఇన్స్పెక్టర్ భాస్క ర్ మరియు అధికారులకు మరియు సిబ్బంది జోగు ముత్తయ్య వాడల బాలయ్య బద్దుల యాదయ్య డ్రై వర్ కొప్పు జంగయ్య జోగు పవన్ జోగు అండాలు కొండ్రు బాలమ్మ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్ గ్రామశాఖ అధ్యక్షులుజోగు నర్సింహ సీనియర్ నాయకులు శేరి రమేష్ ఉడతల రవి గౌడ్ కొంపల్లి పాపిరెడ్డి జోగు జంగయ్య జోగు రోశయ్య తదితరులు పాల్గొన్నారు

# పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయాలి

**- ఫీజు బకాయిలు విడుదల చేయమని అడిగితే కాలేజీల మీద దాడులు చేస్తు బ్లాక్ మెయిల్ చేస్తారా ??**
**- పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తాం**
**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**




హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:
పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయాలని లేని పక్షంలో మార్చి 16 నుంచి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను అడ్డుకొని తీరుతామని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.ఫీజు రీయంబర్స్మెంట్ అడిగితే కాలేజీల మీద దాడులు చేస్తామని బెదిరిస్తూ బ్లాక్ మెయిలింగ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్పడడం సరికాదన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి అటు కాలేజీల మధ్య మధ్య తరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థులు నలిగిపోతున్నారని విచారణ వ్యక్తం చేశారు ఫీజు మొత్తం కడితేనే ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయని ఇటు ప్రభుత్వం మాత్రం ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకుండా నాటకాలు ఆడుతుందని అన్నారు. కేవలం పర్సంటేజీలు వచ్చే వాటికి మాత్రమే బడ్జెట్ నిధులు విడుదల చేస్తూ ఇన్సూరెన్స్ నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శంకర్‌పల్లి లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 24 (వెలుతురు ):**
స్థానిక లిటిల్ స్టార్స్ హైస్కూల్‌లో నేడు మున్సిపల్ ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, స్థానిక కౌన్సిలర్ గిరిజ చంద్రశేఖర్ అప్ప, మాజీ సర్పంచ్ వై. ప్రకాష్ గుప్తని పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ సంజిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసంతో విజయం సాధించిన నాయకులను సన్మానించడం తమకు ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కూడా భవిష్యత్‌లో రాజకీయ అవగాహన పెంపొందించుకుని సమాజ సేవ దిశగా ముందుకు సాగాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, తాను చదువుకున్న అదే పాఠశాలలో ఈ హోదాలో పాల్గొనడం గర్వకారణమని అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, మున్సిపల్ సమస్యలపై ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమను సంప్రదించాలని, తక్షణమే స్పందిస్తామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి మాట్లాడుతూ, ఈ పాఠశాల తనకు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసిందన్నారు. విద్యార్థి దశలో ఖో-ఖో, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొన్న అనుభవాలను పంచుకున్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చే విద్యాసంస్థగా లిటిల్ స్టార్స్ స్కూల్ ప్రత్యేకతను కొనియాడారు. విద్యార్థుల లక్ష్యాలను తెలుసుకుని, వాటిని సాధించడానికి కష్టపడాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కె. మోహన్, ఏఎంసీ డైరెక్టర్ సార్తాజ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బి. ప్రణీత్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్ ):**
రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్ మీడియేట్, ఎస్.ఎస్.సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రరీక్ష ప్రారంభం తర్వాత ఐదు నిమిషాల వరకు హాజరయ్యేందుకు అనుమతినిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పీ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య , పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ , ఫిబ్రవరి 25 వ తేదీ నుండి ఇంటర్ పరీక్షలు మార్చి 14వ తేదీ నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఈ పరీక్షల నిర్వహణలో ఏవిధమైన అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈసారి పరీక్షలకు నిర్ణీత సమయానికన్నా ఐదు నిమిషాల తర్వాత కూడా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులను అనుమతిస్తూ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని , గతంలో ఉన్న వివాదాస్పద పరీక్షా కేంద్రాలపై మరింత విజిలెన్ట్ గా ప్రత్యేక దృష్టి సాధించాలని అన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ల సౌకర్యాలు కల్పించడంతో పాటు సి.సి టీవీ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ కేంద్రం లో ఒక ఏ.ఎన్.ఎం , ఫస్ట్ ఎయిడ్ కిట్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్ష రాయకూడదని అన్ని కేంద్రాలలో బెంచీలు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా శాఖ అధికారులు కాకుండా ఇతర శాఖల అధికారులతో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా మాట్లాడుతూ, ఈ సారి ఇంటర్ పరీక్షలకు 4,89,055 మంది ఫస్ట్ ఇయర్ కు 4,53,832 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ కు హాజరవుతున్నారని అదేవిధంగా 5,28,239 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్ లు ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లను అనుమతించడం లేదని కేవలం పరీక్ష కేంద్రం ఛీఫ్ సూపరింటెండెంట్ కు మాత్రమే ఎమర్జెన్సీ పరిస్థితులలో ఉపయోగించడానికి సెల్ ఫోన్ ను అనుమతిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ కేంద్రం వద్ద మొదటి సారిగా క్లోక్ రూమ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపరీక్షా కేంద్రంలో నైనా ఏవిధమైన అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై కఠిన చర్యలు చేపట్టనున్నట్టు హెచ్చరించారు. ప్రతీ పరీక్ష ప్రశ్న పత్రానికి ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్, సీరియల్ నెంబర్ ఉంటుందని పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా మాత్రమే ప్రశ్నా పత్రాలను ఓపెన్ చేయాలని స్పష్టం చేసారు.

ఈసారి మొదటి సారిగా విద్యార్థుల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా పంపడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొని మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు గాను జిల్లాలో 151 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక లక్ష 35 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, హై పవర్ కమిటీని ఏర్పాటు చేసి పూర్తి బందోబస్తుతో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు, సిసి కెమెరాలు ఏర్పాటు, వైద్య సదుపాయం, శానిటేషన్ ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షల సమయానుకూలంగా అదనపు బస్సులను కేటాయించడం జరిగిందని వివరించారు. పదవ తరగతి పరీక్షలకు కూడా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏర్పాటు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సిరిసిల్లా జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ కూడా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి పాల్గొన్నారు.

# ప్రపంచ రికార్డు సాధించిన హైదరాబాద్ బాలిక

**- తైక్వాండోలో నాగ సాయి అరుషి కు విశేష గుర్తింపు**





**హైదరాబాద్, వెలుతురు ఫిబ్రవరి 24:**
హైదరాబాద్‌కు చెందిన యువ తైక్వాండో క్రీడాకారిణి నాగ సాయి అరుషి ప్రపంచ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. తైక్వాండో చాంపియన్‌షిప్‌లలో అత్యల్ప వయస్సులో అత్యధిక టైటిళ్లు గెలుచుకున్న క్రీడాకారిణిగా ప్రపంచ రికార్డు నెలకొల్పి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. 2022 సంవత్సరం నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వరుస విజయాలు నమోదు చేస్తూ అనేక స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. నేపాల్ రాజధాని కాఠ్మాండులో నిర్వహించిన 4వ మౌంట్ ఎవరెస్ట్ తైక్వాండో అంతర్జాతీయ చాంపియన్‌షిప్ లో జూనియర్ గర్ల్స్ అండర్-59 కిలోల విభాగంలో రజత పతకం సాధించి ప్రతిభ చాటింది. అదేవిధంగా, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 68వ నేషనల్ స్కూల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కూడా రజత పతకం సాధించింది. ఆమె నిరంతర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావాన్ని తెలంగాణ యూత్ తైక్వాండో సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. యువ వయస్సులోనే విశిష్ట విజయాలు సాధిస్తున్న నాగ సాయి అరుషి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ఘనతలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# టీవీవీపీ ను డి ఎస్ హెచ్ గా అప్‌గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయానికి స్వాగతం బి. రవి ప్రకాష్



**మేడ్చల్ వెలుతురు ఫిబ్రవరి 24:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వైద్య విధాన పరిషత్ (ఒఎవూ)ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (ఋూ౧)గా అప్‌గ్రేడ్ చేయాలని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు శ్రీ బి. రవి ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ బి. రవి ప్రకాష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఈ చారిత్రాత్మక ప్రతిపాదనతో ఇప్పటివరకు స్వయం ప్రతిపత్తి సంస్థగా ఉన్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ పూర్తి స్థాయి ప్రభుత్వ విభాగమైన డైరెక్టరేట్ హోదాను పొందుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 184 ఆసుపత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు పరిధిలో ఉంచుకుని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు బోధనాసుపత్రుల మధ్య కీలక వారధిగా ౧ఎవూ పనిచేస్తోందని అన్నారు. స్వయం ప్రతిపత్తి వ్యవస్థ కారణంగా బడ్జెట్ విడుదలలో, జీతాల చెల్లింపుల్లో, ఉద్యోగుల ప్రయోజనాల అమల్లో ఆలస్యాలు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం (౧చీ+౧ూం) చాలా కాలంగా నిరంతరం పోరాటం చేస్తూ వచ్చిందని తెలిపారు. అలాగే, టీజేఏసీ (౧జుజీూజ) భాగస్వామ్య సంఘాల సమిష్టి కృషి వల్లే ఉద్యోగులకు క్యాష్‌లెస్ జు౧ూ సదుపాయం మరియు 010 ప్రయోజనాలను సాధించగలిగామని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు మరియు సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడిన సంఘాల కృషి ఫలితమే ఇవని అన్నారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరిన్ని చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా ౖ=జ లాభాలు పూర్తిస్థాయిలో అందేలా సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని శ్రీ బి. రవి ప్రకాష్ స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం ఉద్యోగుల దీర్ఘకాలిక పోరాటానికి గొప్ప విజయంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# నోముల గ్రామంలో కుటుంబ కలహాలతో భార్య అమృతను గొడ్డలితో నరికి హత్య చేసిన భర్త బాబు



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 24:**
మంచాల మండలం నోముల గ్రామంలో కుటుంబ కలహాలతో మద్యానికి బానిసైన మాద రమోని బాబు ముదిరాజ్ తన భార్య అమృతను గొడ్డలితో నరికి కిరాతకంగా హత్య చేశా డు ఈ సంఘ టనపై మంచాల పోలీస్ స్టేషన్ సీఐ మధు మాట్లాడుతూ బాబుకు ఇద్దరు కుమారులు ఉన్నారు కుటుంబంలో కొద్ది రోజుల క్రితం జరిగిన చిన్న గొడవ వల్ల బాబుతో ఇంటిలో వాళ్లు ఎవ్వరూమా ట్లాడక పోవడంతో బాబు కక్షగట్టి మద్యంమత్తులో ఈ ఘాతకానికి ఒడిగట్టినట్లు తెలిపారు హ త్యఅనంతరం గొడ్డలి అక్కడే వదిలేసి నిందితుడు బాబు పరారయ్యాడు పోలీసులు కేసు న మోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు

# ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ హార్దిక శుభాభివందనాలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ హార్థిక శుభాకాంక్షలను బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ తెలియజేశారు.పరీక్ష రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలన్నారు.పరీక్షలు విజయవంతంగా రాసి మీరంతా అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనసారా కోరుకుంటున్నాను.


# కాలనీ సమస్యల గురించి ఎమ్మెల్యే కు వినతిపత్రం ఇచ్చిన శ్రీ గాయత్రీ నగర్ కాలనీ వాసులు"



**ఎల్ బి నగర్ వెలుతురు ఫిబ్రవరి 24:**
మంగళవారం రోజున ఉదయం మన నియోజకవర్గ శాసన సభ్యులైనటువంటి దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నగారిని కలవడం జరిగింది, కాలనీ లోని "సిసి రోడ్లు మరియు కాలనీ డెవలప్మెంట్" గురించి మన ఏమ్మెల్యే కి విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది, దానికి వారు సానుకూలంగా స్పందించి త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి వివరాలు అధ్యక్షులు దూడల అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు (చిన్న) బాలకృష్ణ, కోశాధికారి మైల శ్రీకాంత్ యాదవ్, కార్యనిర్వాహన కార్యదర్శి బాతరాజు గురుమూర్తి, సంయుక్త కార్యదర్శులు అక్కనపల్లి జనార్ధన చారి, బొచ్చు రవీందర్ పాల్గొన్నారు

వెలుతురు

# గుండాల మండలంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ ఏర్పాటు



**గుండాల ఫిబ్రవరి 24(వెలుతురు):** గుండాల మండలంలో ఆరోగ్య లక్ష్మి పథకం సమర్థవంతమైన అమలుకు సర్పంచ్ ఆధ్వర్యంలో ఆరోగ్య లక్ష్మి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఈ కమిటీ కీలకంగా పనిచేయనుంది. ఈ కమిటీలో మొత్తం 11 మంది సభ్యులతో కమిటీని రూపొందించారు. సర్పంచ్



ఛైర్‌పర్సన్‌గా, అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మిగతా తొమ్మిది మంది సభ్యులుగా గ్రామానికి చెందిన ప్రతినిధులను ఎంపిక చేశారు. ప్రతి నెల 5వ తేదీ లోపు కమిటీ సమావేశం నిర్వహించి, పథకం అమలుపై సమీక్ష చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హైస్కూల్ ఉపాధ్యాయులు జి.బాలరాజు,భాగ్యలక్ష్మి, వీఓ ఎస్.బాలకృష్ణ, చంద్రకళ,మానస,ఎం.డి. ఫైమీద్,రేణుక,వెన్నెల, ఆశా వర్కర్ సుజాత, కళమ్మ, అంగన్వాడీ టీచర్లు కె.సునీత, పి.లక్ష్మి,వి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందుతున్న సేవలు సమర్థవంతంగా అమలవుతూ, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. గ్రామ ప్రజలు కూడా కమిటీకి సహకరించాలని కోరారు.



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలా సంధర్భంగా 24/02/2026 మంగళవారం రోజున స్థానిక శ్రీ భాగ్యలక్ష్మి మహిళా భజన బృందం వారు భక్తి కీర్తనలతో భక్తులను అలరించారు

**యాదగిరిగుట్ట వెలుతురు ఫిబ్రవరి 24:**

## అభాగ్యులకు అండగా సర్పంచ్ మరియు మాజీ సర్పంచ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 24:**

మండలం వెల్లంకి గ్రామంలో ఆవనగంటి సిరివెన్నెల 12 దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడడం జరుగుతుంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మరియు మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు 10,000 రూపాయల చొప్పున మొత్తం 20000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇడం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షుడు ఈడెం శ్రీనివాస్ బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పున్న వెంకటేశం, మాజీ సర్పంచ్ మదూరి వెంకటేశ్వరరావు , అవనిగంటి మల్లేష్ ఆవన గంటి స్వామి ఆవనగంటి లింగస్వామి గంజి రంగయ్య ఎడ్ల కృష్ణారెడ్డి పోచబోయిన మల్లేష్ తాటిపాముల రాజశేఖర్ ఆవనగంటి వెంకటేశం అంకం పాండు గూడెల్లి దామోదర్ మరియు సిరివెన్నెల కుటుంబ సభ్యులు తదితరు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కోరుతూ వినతి



**ఖమ్మం, వెలుతురు ఫిబ్రవరి 24:**

ఖమ్మం జిల్లా అక్రిడేషన్ కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తిని సభ్యుడిగా నియమించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగాలంటే జర్నలిస్టు సంఘాలకు తగిన ప్రాతినిధ్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు, చిన్న పత్రికల విలేకరుల సమస్యలను సమర్థవంతంగా కమిటీలో ప్రస్తావించేందుకు టిడబ్ల్యుజేఎఫ్‌కు అవకాశం కల్పించాలని లేఖలో వివరించారు. ఈ లేఖ ప్రతిని జిల్లా డిపిఆర్వో కి అందజేసినట్లు నాయకులు తెలిపారు. వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో జిల్లా నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. జిల్లా పరిపాలన జర్నలిస్టుల హక్కులను గౌరవిస్తూ, సముచిత నిర్ణయం తీసుకుని కమిటీలో టిడబ్ల్యుజేఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి, కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా కోశాధికారి కాసోజు శ్రీధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, గౌరవరపు జగదీష్, మామిడాల వీరబాబు, ఎలిసెట్టి రామకృష్ణ బాబు, వంగ పుంగమ గౌడ్, కరాటే వేణు, పాగా యేనా, భాగ్యరాజ్, సందీప్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దాతల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేయొద్దు

- ఇలా చేస్తే రాబోయే రోజుల్లో దాతలు వెనుకడుగు
- గ్రామాభివృద్ధి కి కుంటు పడుతుంది
- హనుమాన్ యూత్ అధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయనికి లేఖ

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 24:**

దాతల సహకారంతో నిర్మించిన కళా వేదిక తొలగింపు వారి మనోభావాలను దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతుందని నిర్నేముల హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. గ్రామంలో హమమాన్ యూత్ అసోసియేషన్ గత 12 ఏళ్లుగా ఈ సంస్థ వివిధ సామాజిక మరియు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందనీ, గ్రామంలోని పాత పాఠశాల ప్రాంగణంలో మేము గ్రామస్తుల సహకారంతో గ్రామంలో ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక చైతన్యం కోసం, ముఖ్యంగా దేవి నవరాత్రుల వంటి పండుగల నిర్వహణకు పరిమాణంలో ఒక వేదికను నిర్మించినట్లు, ఇది ఏ ఒక్క వ్యక్తి స్వంతం కాదు, గ్రామస్తులందరి ఉమ్మడి ఆస్తి అని, ఈ వేదిక నిర్మాణం కోసం గ్రామస్తులు, భక్తులు మరియు దాతలు తమ కష్టార్జితాన్ని




వెచ్చించారాన్నారు. ప్రభుత్వ ధనంపై భారం పడకుండా, సామాజిక బాధ్యతతో దీనిని నిర్మించడం జరిగిందన్నారు. ఈ వేదిక ప్రభుత్వానికి ఒక అదనపు సౌకర్యం వంటిదనీ, దీనివల్ల ప్రభుత్వ అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాలు మరియు గ్రామ సభలు నిర్వహించుకోవడానికి ఎంతో సులభమవుతుంది, తద్వారా ఇది భవిష్యత్తులో ఒక శాశ్వత ప్రజా వనరుగా ఉపయోగ పడుతుందన్నారు. ఇన్ని రకాలుగా ఉపయోగం కోసం నిర్మించిన వేదికను ప్రస్తుతం ప్రతిపాదించిన శ్రీ శక్తి భవన నిర్మాణానికి అవసరమైన ఖాళీ స్థలం ఇక్కడే అనే ఉద్దేశ్యంతో అక్కడ భవనాన్ని నిర్మించడానికి తగినంత వెసులుబాటు ఉన్నదని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అన్ని కోణాల ఆలోచన చేసి రాజకీయ ఉద్దేశ్యాలు పక్కన పెట్టి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తిరిగి సర్వే చేయించి, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టాలని యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు. మునుకుంట్ల మల్లేష్, ఏ బూషి రమేష్ , దోమల పల్లి గోపి, పల్లె రవీందర్ రెడ్డి, ఆవుల లక్ష్మీనారాయణ, సుర్వి నవీన్, దాసరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు

# అప్పుల కుప్పగా మారిన గ్రామ పంచాయతీలు

- నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యం?
- నూతన పాలకవర్గాలకు నిధులు కేటాయించాలి.
- సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్.






**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 24:**

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు కనీసం నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తే గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ విమర్శించారు.వెల్లంకి గ్రామంలో రఘురామ ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల నుండి గ్రామపంచాయతీలకు పైసా విదల్చకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కొంటుబడి పోయిందని అన్నారు.ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి చేతులు దులుపుకుంటే ఎలా అని ఎద్దేవా చేశారు.కనీసం గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో గ్రామపంచాయతీలు కాలమెల్ల తీస్తున్నాయని నూతనంగా ఎన్నికైన సర్పంచులు లక్షల రూపాయలు తమ చేతుల్లో నుండి ఖర్చు పెడుతూ అప్పుల పాలవుతున్నారని వాపోయారు. గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలు అన్న విషయాన్ని కేంద్రంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ విస్మరిస్తున్నాయని అన్నారు.15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయటంలో కేంద్రంలో ఉన్న బీజేపీ నిర్లక్ష్యం సరికాదాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్ లో గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు.ఇప్పటికే పారిశుధ్యం పడకేసి ప్రజా ఆరోగ్యం నిర్వీర్యం అవుతుందని ఎన్నికలు నిర్వహించి అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కాలయాపన చేయటం సరికాదని అన్నారు.గ్రామ పంచాయతి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఇల్లు గడవని పరిస్థితి నెలకొన్నదని, గత 5 సంవత్సరాలుగా నూతన పింఛన్ ఇవ్వకపోవడంతో గ్రామాల్లో అనేక మంది వృద్దులు,వికలాంగులు,వితంతువులు గ్రామ పంచాయతి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు.నెలల తరబడి కనీసం కరెంట్ బిల్లులు కట్టలేని దీన స్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య,వనం ఉపేందర్,మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి, బోయిని ఆనంద్, జంపాల అండాలు, కందుల హనుమంతు, కల్లూరి నగేష్,మండల కమిటి సభ్యులు ఆవనగంటి నగేష్, గన్నేబోయిన విజయభాస్కర్, గాదె నరేందర్,గొరిగే సోములు, వేముల సైదులు,బావండ్లపల్లి బాలరాజు, నీల ఐలయ్య, బోడిగే రజిత, ఎండీ రషీద్, తొలుపునూరి శ్రీనివాస్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, మేడబోయిన శ్రీనివాస్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, పులి బిక్షం, మునికుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్, పావిరాల మత్యగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఒక్కరూ కంటి సమస్యతో బాధపడకూడదన్నదే ఎమ్మెల్యే లక్ష్యం

## - సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్.

**మునుగోడు వెలుతురు ఫిబ్రవరి 24:**

మునుగోడు నియోజకవర్గంలో ఏ ఒక్కరు కంటి సమస్యతో బాధపడకూడదన్నదే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి లక్ష్యమని సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జమస్తాన్ పల్లి గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా కండ్ల అద్దాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలిచి సహాయ సహకారాలు అందిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి మండల, గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించగా అర్హులైన వారికి కండ్ల అద్దాలు పంపడం జరిగింది. ఇట్టి అద్దాలను లబ్ధిదారులకు మంగళవారం రోజున మన గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో



అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అందుగుల నరసమ్మ యాదయ్య, వార్డు సభ్యులు జాజుల నాగమ్మ శంకరయ్య, పంతంగి నరసింహ, మేడి మౌనిక నరేందర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముంత యాదగిరి, ఆశ వర్కర్ నకిరకంటి లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ పగిళ్ల సైదులు, సీనియర్ జర్నలిస్ట్ జాజుల స్వామి గౌడ్, గ్రామస్తులు ముంత లక్ష్మయ్య, ముంత కృష్ణయ్య, జాజుల మారయ్య, నాతి నరసింహ, ముంత బిక్షం, పంతంగి వెంకన్న, జాజుల రవి, ముంత స్వామి, ముంత మహేష్, ముంత రవీందర్, ముంత బిక్షం, పగిళ్ల సత్తయ్య, పగిళ్ల వెంకటయ్య, జాజుల కృష్ణయ్య, ముంత లింగస్వామి, పగిళ్ల నరసింహ, పగిళ్ల మహేందర్, ముంత మారయ్య, పులేందర్, తదితరులు పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న రంగంపేట పీఠాధిపతి

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 24 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో రంగంపేట పీఠాధిపతి మాదవానంద స్వామి మంగళవారం భక్త మార్కండేయ ఆలయంలో చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, మహా హారతి చేపట్టారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషన చేశారు. మానవ జీవితం అత్యంత ప్రాముఖ్యమైనదని పరోపకార స్వభావాన్ని పెంచుకోవాలని చెప్పారు. దైవభక్తితోనే మోక్షమార్గం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ గురురాజ్ శర్మ, పురోహితులు కృష్ణశాస్త్రి, వెంకటేశం పంతులు, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో అర్బన్ ఆసుపత్రి పునరుద్ధరణకు

# కౌన్సిల్‌లో గళమెత్తిన కౌన్సిలర్ పర్వీన్ బేగం

- శాంతినగర్ ప్రజల ఆరోగ్య హక్కు కాపాడాలని డిమాండ్...
- ఐడిఎస్‌ఎంటి కాలనీ ఇళ్లకు అసెస్‌మెంట్లు, రిజిస్ట్రేషన్లు వెంటనే ఇవ్వాలంటూ విజ్ఞప్తి...

**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ ఆసుపత్రిని ఇటీవల తొలగించడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని 35వ వార్డు కౌన్సిలర్ ప్రవీణ బేగం ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఆసుపత్రిని తిరిగి ప్రారంభించాలని ఆమె గళమెత్తారు. గత ప్రభుత్వం ప్రజలకు సమీపంలోనే ప్రాథమిక వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన అర్బన్ ఆసుపత్రి



మూతపడడం వల్ల ముఖ్యంగా పేదలు, వృద్ధులు, గర్భిణీలు మరియు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల ఆర్థికభారం, సమయనష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వెంటనే ఆసుపత్రిని పునరుద్ధరించి సక్రమంగా వైద్య సిబ్బంది, అవసరమైన సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌ను కోరారు. అదేవిధంగా ఐడిఎస్‌ఎంటి కాలనీలో నిరుపేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ అసెస్‌మెంట్లు, రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు మరియు విద్యుత్ మీటర్ల మంజూరు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఇళ్లకు సంబంధించి అవసరమైన పర్మిషన్లు ఇవ్వకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో ఇల్లు కట్టుకున్న ప్రతి కుటుంబానికి తక్షణమే రికార్డులు జారీ చేసి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారులు ఆలస్యం చేయకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 22వ డివిజన్ లో చెత్త సేకరణ కోసం నూతన ట్రాక్టర్ కేటాయింపు...

**- మేయర్, కమిషనర్ కు ధన్యవాదాలు తెలియజేసిన కార్పొరేటర్ బండ రమణారెడ్డి**





**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 24:**
కరీంనగర్ నగరపాలక సంస్థ 22వ డివిజన్ లో చెత్త సేకరణ నిమిత్తం నూతన ట్రాక్టర్ ను కేటాయించారు. ట్రాక్టర్ కు మంగళవారం రోజున మేయర్ కోలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్లో చెత్త సేకరణకు అవసరమైన వాహనాల విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వాహన కొరత ఉందని స్థానిక కార్పొరేటర్ బండ రమణారెడ్డి తమ దృష్టికి తీసుకురాగానే నూతన ట్రాక్టర్ ను డివిజన్ కు కేటాయించడం జరిగిందన్నారు. డివిజన్లో పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. డివిజన్ అవసరాల కోసం అడగగానే నూతన ట్రాక్టర్ కేటాయించిన మేయర్ కోలగని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లకు కార్పొరేటర్ రమణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయిన్పల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేష్, గుగ్గిల్లపు రమేష్ , వంగల పవన్ ,పెద్దపల్లి జితేందర్, మొండన్న, ఎన్నం ప్రకాష్ , వేముల చంద్రశేఖర్ , వెంకటేష్ లతోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డి ఆర్ ఏ)కమిటీ సమావేశం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఫిబ్రవరి 24**
జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (DRA) కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డిఆర్ఏ కమిటీ చైర్పర్సన్, కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సమావేశంలో జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి డాక్టర్ రవీందర్ గౌడ్ కమిటీకి నివేదిక సమర్పిస్తూ, ఇప్పటివరకు జిల్లాలో 178 ప్రైవేట్ హాస్పిటల్స్, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లు, స్కాన్ సెంటర్లకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, కొత్త అనుమతులు , రీన్యువల్స్ కోసం 36 ఆసుపత్రుల నుండి దరఖాస్తులు అందినట్లు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు దరఖాస్తులపై స్థల పరిశీలనలు నిర్వహించాలని ఆదేశించగా, తనిఖీల అనంతరం చెక్‌లిస్టులను కార్యాలయానికి సమర్పించారు. అందులో ఐదు రీన్యువల్ దరఖాస్తులు ,ఇరవై కొత్త ఆసుపత్రుల దరఖాస్తులు Clinical Establishments Act, 2010 ప్రకారం అవసరమైన పత్రాలతో సమర్పించబడి ఉన్నట్లు నిర్ధారించబడింది. మిగతా పదకొండు ఆసుపత్రులు సరైన పత్రాలు సమర్పించనందున వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులతో చర్చించిన అనంతరం ఐదు రీన్యువల్స్, ఇరవై కొత్త ఆసుపత్రులకు అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించారు. జిల్లా డీఎంహెచ్ఓ అనుమతి లేకుండా ఎటువంటి కొత్త హెల్త్ ఫెసిలిటీ ప్రారంభించకూడదని, నడపకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో పదివేల నుండి యాభై వేల రూపాయల వరకు జరిమానా విధించడం లేదా ఆ సంస్థలను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఖసశ్రీ ౹రా నరసింహ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మల్లికార్జున్, అడిషనల్ ఎస్పీ, బి.ఓలు డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ విద్య, డాక్టర్ రోహిత్, డెమో వేణుగోపాల్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర భవ్య మందిర నిర్మాణ భూమి పూజ

**- కరపత్ర ఆవిష్కరణ**

**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 24 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలోని పంచగామ కమాన్ వద్ద నూతనంగా నిర్మించబోయే శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ భూమి పూజ కరపత్రాన్ని నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామీజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామీజీ కరకములచే ఆవిష్కరించారు. మార్చి నెలలో 6,7 తేదీలలో మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు కార్యక్రమాన్ని శ్రీలలితా దేవి వైభవంట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇట్టి ఆలయానికి భూదాతలుగా శ్రీనివాసరావు దేశ్ పాండే,సుందాల ఈశ్వరి భాయ్ ఉమాకాంత్, ఇల్లింతల ప్రసన్నలక్ష్మి రాజు గుప్తా, పద్మ కస్తూరి నాగేశ్వరరావు, పట్ని సరస్వతి విజయకుమార్, బుస్స లక్ష్మి కృష్ణ గుప్త లు ఉన్నారు. వైభవోపేతమైన ఆరంభ కార్యక్రమానికి సమస్త భక్తాగ్రేషులు హాజరు కావలసిందిగా మాధవానంద స్వామీజీ తెలిపారు. కార్యక్రమంలో లలిత దేవి ట్రస్ట్ వ్యవస్థాపకులు మలమంచి అరుణామోహన్ జోషి గారు ట్రస్ట్ సబ్యులు, పురోహితులు మలవంచి శిల్ప గురురాజ శర్మ మార్కండేయ ఆలయ కమిటీ బాధ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# ఇంటర్, పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఫిబ్రవరి 24**
జిల్లా లో ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలు,సలహాలు సూచనలకు 9866143782 9948164514 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని, ఇంటర్ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటలవరకు ఉంటాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఇంటర్, పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నారు. మంగళవారం చీఫ్ సెక్రెటరీ సంబంధిత ఉన్నతాధికారులతో కలసి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు , సంబంధిత శాఖల అధికారులతో పదవ తరగతి,, ఇంటర్మీడియట్ (ప్రథమ & ద్వితీయ సంవత్సరం) పబ్లిక్ పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్ల పై సమగ్ర శిక్ష ౹ావీ SHRI పథకాల కింద జిల్లాల వారీగా వ్యయాల పురోగతిని ,విద్యార్థులకు ఉదయపు అల్పాహారం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు భూముల గుర్తింపు పై TGEWIDC ఆధ్వర్యంలో జరుగుతున్న సివిల్ పనుల పురోగతి స్థితి , YIIRS కు సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్,



సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, కేంద్రాల వద్ద సౌకర్యాలు, సమన్వయం పై దృష్టి సారించాలని, విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సమర్థవంతంగా సన్నద్ధం చేయడానికి చేపట్టాల్సిన అకాడెమిక్ చర్యలపై చర్చించారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శి పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్, మార్చ్- 2026 సంబంధించి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ,పరీక్షలు జరిగే సమయంలో అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని 163 ఎఅం పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 9013, రెండవ సంవత్సరం విద్యార్థులు 8940 హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందనీ చీఫ్ సూపరెండెంట్లు నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పాటించాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత, సమయపాలన, పర్యవేక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే, జిల్లా పరిపాలన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని , అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు వచ్చే నెల మార్చి 14 వ తేదీ నుండి ఎప్రిల్ 16 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లాలో 65 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష ప్రారంభానికి ముందుగానే విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలించాలని, పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, మొబైల్ ఫోన్ లు ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను పరీక్షా కేంద్రాల్లో నియమించి, ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని , విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను తగిన భద్రత మధ్య తరలించాలని, పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లు అనుమతించరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, గతం లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండ జాగ్రత్త వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అడిషనల్ ఏస్ పి,జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, షేక్ సలాం ,డీఈఓ రాజు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరకు పంటలో అధిక దిగుబడికి శాస్త్రీయ పద్ధతులే మార్గం

**- జహీరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన శిక్షణ...**





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
రైతులు చెరకు పంటలో మెరుగైన దిగుబడులు సాధించాలంటే శాస్త్రీయ పద్ధతులను కచ్చితంగా అనుసరించాలని నిపుణులు సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్ లో చెరకు పంటలో అధిక దిగుబడి సాధన మరియు భూసార పరీక్షా కార్డు ఆధారిత ఎరువుల వినియోగంపై విస్తృత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ పరిశోధన స్థానం, బసంతపూర్ ప్రధాన శాస్త్రవేత్త డా. విజయ్ కుమార్ మాట్లాడుతూ చెరకు సాగులో నాణ్యమైన విత్తనాల ఎంపిక అత్యంత ముఖ్యమని తెలిపారు. అధిక దిగుబడి రకాలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంట స్థిరత్వం పెరుగుతుందని చెప్పారు. అలాగే వరుసల మధ్య తగిన దూరం పాటించడం వల్ల మొక్కల పెరుగుదల మెరుగుపడి దిగుబడి పెరుగుతుందని వివరించారు. మట్టి పరీక్ష ఆధారంగా ఎరువుల మోతాదును నిర్ణయించడం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారవంతత కాపాడబడుతుందని ఆయన తెలిపారు. కలుపు నియంత్రణలో సమయానుకూల చర్యలు, సమతుల్య నీటి పారుదల, పురుగు మరియు వ్యాధి నియంత్రణ చర్యలు పాటించడం ద్వారా రైతులు 100 క్వింటాళ్లకు పైగా దిగుబడులు సాధించగలరని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న పద్ధతులను వివరించి రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని స్పష్టం చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. మట్టి పరీక్షా కార్డు ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా దిగుబడి పెరుగుదలతో పాటు రసాయన ఎరువుల అనవసర వినియోగం తగ్గుతుందని తెలిపారు. సూక్ష్మ పోషకాల లోపం వల్ల కలిగే నష్టాలను వివరించి వాటి నివారణ చర్యలను రైతులకు సూచించారు. సేంద్రీయ కార్బన్ పెంపు చర్యలు చేపట్టడం ద్వారా దీర్ఘకాలికంగా నేల సారాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. మండల వ్యవసాయ అధికారి లావణ్య నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. నానో యూరియా మరియు నానో డిఏపి వాడకం విధానం, పిచికారీ దశలు, సరైన మోతాదులు మరియు ఖర్చు తగ్గింపు ప్రయోజనాలను వివరించారు. నానో ఎరువుల వినియోగం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. రైతులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పలు అంశాలపై ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమం ముగింపులో అధికారులు రైతులు క్రమం తప్పకుండా మట్టి పరీక్షలు చేయించుకొని శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. విజయ్ కుమార్, రమేష్, డా. సాయి ప్రియాంక, స్వామి, ఎడిఎ బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, రాజు, వీరేందర్, బి.టి.యం చరణ్, దిడిగి గ్రామ సర్పంచ్ తదితరులు మరియు అనేక మంది రైతులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మున్సిపల్ సర్వసభ సమావేశంలో గందరగోళం

**- ఎంపీ సమన్వయంతో సజావుగా తీర్మానాలు...**



**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ మరియు పాలకవర్గ సభ్యుల సర్వసభ సమావేశం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్స్ ఆఫీసియో ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ ఎండీ యూనుస్, వైస్ చైర్‌పర్సన్ కొత్త కాపు శిరీష మరియు పాలకవర్గ సభ్యులను ఎంపీ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ జరుగుతున్న సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, గందరగోళం చోటుచేసుకుంది. దీంతో ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, చైర్మన్ ఎండీ యూనుస్, వైస్ చైర్‌పర్సన్ శిరీషలు ఇరు పార్టీల సభ్యులను నచ్చజెప్పి



పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం కౌన్సిల్ సమావేశం సజావుగా కొనసాగింది.దఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జహీరాబాద్ పట్టణ అభివృద్ధి కోసం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా అందరూ కలిసి కృషి చేయాలని సభ్యులకు సూచించారు. అలాగే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించి, మున్సిపల్ కమిషనర్ జేతూరాం నాయక్ మరియు అధికారులతో కలిసి మున్సిపల్ పరిధిలోని 37 వార్డుల్లో ఉన్న సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. అలా చేయడం ద్వారా ప్రతి వార్డులోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జేతూరాం నాయక్, ఎంఆర్వో దశరత్, చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత పాలనలో యూరియా కొరత

**వలిగొండ, ఫిబ్రవరి 24:(వెలుతురు న్యూస్)**
వలిగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి యూరియా యాప్ ను రద్దుచేసి రైతులందరికీ యూరియా తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి గారు

# నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు

- హాజరవుతున్న విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు
- దండంపల్లి మనోజ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఉస్మానియా యూనివర్సిటీ



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజే స్తున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ యూత్ కాంగ్రెస్ నాయకుడు దండంపల్లి మనోజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ అధికారులు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరవ్వాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని హాల్ టికెట్ వంటి అవసరమైన పత్రాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు మానసిక ధైర్యం ఇచ్చి, ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. కృషి, పట్టుదలతో సిద్ధమైన ప్రతి విద్యార్థి విజయాన్ని సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు

# న్యాల్కల్ మండల అభివృద్ధికి భారీ నిధులు

- ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కృషితో కోట్ల రూపాయల పనులు...
- మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజి జడ్పిటిసి భాస్కర్ రెడ్డి...





**జహీరాబాద్ వెలుతురు ఫిబ్రవరి, 24:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్కల్ మండల అభివృద్ధికి స్థానిక పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ ప్రత్యేక శ్రద్ధతో భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని న్యాల్కల్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్ రెడ్డి తెలిపారు. మండలాన్ని తన స్వంత ప్రాంతంగా భావిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు ఎంపీ కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద 2024-2025 సంవత్సరానికి రూ.1.20 కోట్లు, 2025-2026 సంవత్సరానికి రూ.3.20 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అదనంగా 28 గ్రామ పంచాయతీలకు మహిళా శక్తి భవనాలు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. గ్రామీణ మహిళల సాధికారతకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. మండలంలో ఎంపీ ప్రత్యేక నిధులు, నరేగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టబడుతున్నాయని వివరించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, తాగునీటి సరఫరా మెరుగుదలకు బోర్ మోటర్ల ఏర్పాటుకు రూ.60 లక్షలు ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా మంజూరయ్యాయని తెలిపారు. 2025-2026 సంవత్సరానికి న్యాల్కల్‌కు రూ.50 లక్షలు కేటాయించగా, న్యాల్కల్ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి రూ.15 లక్షలు డీఎంటీఎఫ్ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మొత్తం రూ.5.65 కోట్ల నిధులు ఆమోదం పొంది కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఇంచార్జిగా డాక్టర్ చంద్రశేఖర్ సేవలందిస్తున్నారని, మంత్రివర్యులు కూడా న్యాల్కల్ మండలానికి అదనంగా రూ.1 కోటి కేటాయించారని వెల్లడించారు. ఎంపీ షెట్కార్ మరియు ఇంచార్జి డాక్టర్ చంద్రశేఖర్ సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ ముఖ్య నాయకుల సహకారం, మండల స్థాయి నాయకుల ఐక్యత వల్లే ఎక్కువ నిధులు సాధ్యమవుతున్నాయని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ షెట్కార్, ఇంచార్జి చంద్రశేఖర్ మరియు నియోజకవర్గ నాయకత్వానికి మండలం తరపున కృతజ్ఞతలు తెలిపారు

# ప్రజల పరేషాన్‌కు కారణం అధికారుల గైర్హాజరు కాప్రా సర్కిల్‌లో పరిపాలనా వైఫల్యం?

**కాప్రా ఫిబ్రవరి 24 వెలుతురు:**

కాప్రా సర్కిల్ పరిధిలోని ఎంఎంసీ కార్యాలయంలో రెవిన్యూ అధికారుల గైర్హాజరు కారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత రెండు మూడు రోజులుగా అధికారులు సెలవులో ఉండటంతో కార్యాలయ పనులు నిలిచిపోయినట్లయ్యాయి. వివిధ అవసరాల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో తిరిగి వెళ్తున్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులు, కొత్త అసెస్‌మెంట్ నమోదు, మ్యుటేషన్ దరఖాస్తులు, ధృవపత్రాల జారీ వంటి ముఖ్యమైన సేవలు ఆలస్యమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన ఫైళ్లు కూడా ముందుకు కదలకపోవడంతో సమస్యలు మరింత పెరుగుతున్నాయి.

కమలా నగర్‌కు చెందిన ఓ స్థానికుడు మాట్లాడుతూ, "మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి రోజులు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. ప్రతిరోజూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు" అని వాపోయాడు.

అత్యవసర పనులు కూడా ఆలస్యమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు వరుసగా సెలవులు తీసుకున్నప్పటికీ, ప్రత్యామ్నాయంగా మరో అధికారిని నియమించకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చిందని స్థానికులు విమర్శిస్తున్నారు. సిబ్బంది ఉన్నప్పటికీ సమన్వయం లోపించడంతో ఫైళ్ల పరిష్కారం నిలిచిపోయిందని అంటున్నారు.

ప్రజా సమస్యలు పేరుకుపోకుండా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సెలవులో ఉన్న సమయంలో బాధ్యతలను ఇతరులకు అప్పగించే విధానాన్ని అమలు చేయాలని వారు కోరుతున్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ మనుమయ సంఘం

- నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం
- విశ్వకర్మల ఐక్యతతోనే సామాజిక సాధికారత సాధ్యం
- రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు క్రిష్ణమాచారి





**ఎల్బీనగర్, వెలుతురు ఫిబ్రవరి 24:** తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ మనుమయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం సరూర్ నగర్ లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు క్రిష్ణమాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విశ్వకర్మ చేతివృత్తులు నేడు యంత్రాల రాకతో తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విశ్వకర్మలకు ప్రత్యేక సబ్సిడీలు, ఆధునిక పనిముట్లు అందించాలని సుంకోజు కృష్ణమాచారి డిమాండ్ చేశారు. మన కులవృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. విశ్వకర్మ యువతకు ఉపాధి కల్పనలో సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో విశ్వకర్మలకు రాజకీయ ప్రాధాన్యత పెరగాలని ఆకాంక్షించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వృద్ధులకు ప్రత్యేక పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు.కుల సంఘాల్లో ఉన్న చిన్న చిన్న విభేదాలను పక్కన పెట్టి అందరూ కలిసి నడవాలని సూచించారు.విశ్వకర్మ కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రతి విశ్వకర్మ కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించేలా సంఘం చర్యలు తీసుకుంటుందన్నారు. సంఘం నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేసే వారికే పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా విభాగం ద్వారా కులంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మన వృత్తుల్లో భాగం చేసుకోవాలని సూచించారు. విశ్వకర్మలు అంటే కేవలం పనివారు మాత్రమే కాదు, ఈ సృష్టికి మూలస్తంభాలని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే విశ్వకర్మల స్థితిగతులపై సమగ్ర సర్వే చేపట్టాలని కోరారు. మన హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. అనంతరం సంఘం సభ్యులందరికీ సుంకోజు కృష్ణమాచారి క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భవన నిర్మాణ కార్మికులు 300 కుటుంబాలకు లేబర్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ/ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు అందోజు శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కొండూరు వేణుగోపాల్ చారి, కోశాధికారి బొల్లోజు నరసింహ చారి, జిల్లాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

-మోత్కూర్ రజక సంఘం.



**మోత్కూరు, ఫిబ్రవరి 24 ( వెలుతురు న్యూస్ ) :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న స్వామి జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మోత్కూర్ రజక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు . మంగళవారం ఈ మేరకు స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద చిన్నారిని హత్య చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ చిన్నారికి క్రొవ్వుతులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ రిజర్వేషన్ సాదన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర మాట్లాడుతు దైవం దగ్గర కూడా కుల ప్రస్తావన తీసుకురావడం అనేది అక్కడ ఉన్న అగ్ర కుల నాయకుల అహంకారానికి,అజ్ఞానానికి నిదర్శనం అని ఇంకా వారు మధ్యయుగంలోనే జీవిస్తున్నారని, పశువుల కంటే ఇంకా నీచంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు కూసంపల్లి యాకయ్య, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షులు బొడ్డుపల్లి మైసయ్య, రజక వృత్తి దారుల సంఘం జిల్లా సభ్యులు కూసంపల్లి సోమనర్సయ్య, బొడ్డుపల్లి అబ్బసాయిలు,బొడ్డుపల్లి చిన్న పక్కీరు,బొడ్డుపల్లి సతీష్,బొడ్డుపల్లి శివాజీ బి. ఆర్.ఎస్. ఎస్. మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి,స్థానిక నాయకులు బోడిగె శ్రీను,చేతరాసి వెంకన్న,అవిశెట్టి కిరణ్,బుషిగంపల సందీప్,బందెల రవి,అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# 25 తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి తప్పిదాలకు తవ్వివ్వకుండా నిర్వహించాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఫిబ్రవరి 24:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లాఈ నెల 25వ తేదీ బుధవారంనుండి ప్రారంభమయ్యేఇంటర్మీడి యట్ వార్షిక పరీక్షలను ఎలాంటి చిన్న తప్పిదాలకు తవ్వివకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులనుఆదేశించారు.మంగళ వారంవీడి యోకాన్ఫరెన్స్ అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరం నుండి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత ఆర్డీఓలు ఎంపిడి ఓలు ఆర్ సి లు పోలీస్ శాఖ అధి కారులు, విద్యుత్ అధికారులు వి ద్యాశాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల25వ తేదీ బుధవారం నుండి మార్చ్18వ తేది వర కు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం12.00 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియ ట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు ఇంట ర్మీడియట్ పరీక్షలకు నిర్వహణకు సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూప్ చేయాలన్నారు ఆర్డీఓ కార్యాలయాలలో ఎగ్జామ్ సెల్ ను ఏర్పాటు చేయాలన్నారు పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా పని చేయాల న్నారు పరీక్ష కేంద్రాలలో ఎటువంటి తప్పిదాలు జరగ కుండా నిర్వహించాలన్నారు జిల్లాలో 200 పరీక్షా కేంద్రాలద్వారా 84,301మంది మొదటి సంవత్సరం విద్యార్థులు70,171మంది రెండవ సంవత్సరం విద్యార్థులు జిల్లాలో మొత్తం1,54,472 మంది విద్యార్థు లు పరీక్షలకు హాజరవుతు న్నారని 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కె మెరాలనుఏర్పాటు చేయాలని మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వ హించా లని సంబంధిత అధికారులకు సూచించారు పోలీస్ శాఖవారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని పరీక్షా పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీ సుకోవాలని తెలిపారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారు లు బస్సులను నడపాలని.పరీక్షా కేంద్రాలవద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు మందుల తో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అ ధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువం టి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు పోస్టల్ శాఖ వారు జవా బు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు పరీక్షా కేంద్రాలలో అవసరమైన మం చి నీరు ఫాన్స్,టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు పరీక్ష కేం ద్రాల్లోకి ఎవ్వరూ కూడా మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లకూడదని విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎల్రక్టానిక్ పరికాలు ముఖ్యంగా మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా పరిశీలించాలని సూచించారుఈ సమావేశంలో ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి.అనంత రెడ్డి సరిత మున్సిపల్ కమిషనర్లు జిల్లా ఇంటర్మీ డియట్ అధికారి వెంక్యానాయక్ విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు వైద్య ఆరోగ్యశాఖ అధికా రిలలితా దేవిమ పోలీస్ అధికారులు పోస్టల్ శాఖ అధికారులు ఆర్టీసీ అధికారులువిద్యుత్ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఒరిగిందేమీ లేదు.

-మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకూబ్ రెడ్డి



**మోత్కూరు, ఫిబ్రవరి 24 (వెలుతురు న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిన ఈ ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలు కట్టుకున్న ఇండ్లను కూల్చివేసి ఆ పార్టీ అనుకున్న మహనీయుల విగ్రహాలను పెట్టడమేనా అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొణతం యాకూబ్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం నాడు స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ రైతుబంధు సకాలంలో ఇవ్వకుండా రైతులను పట్టించుకోకుండా వందల కోట్లు పెట్టి విగ్రహాలు నిర్మించడం ప్రజాధనం వృధా చేస్తుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే నేడు కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఎవరు మెప్పు కోసం గాంధీ విగ్రహాలు పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ రెండున్నర ఏళ్లలో మహిళలకు ఉచిత బస్సు తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వృద్ధులకు,వికలాంగులకు పెన్షన్లను పెంచుతామని ఎన్నికల ముందు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గాంధీ విగ్రహం కోసం 5000 కోట్లు,వారి కుటుంబానికి 1000 కోట్లు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి

-ప్రవేట్ విద్యాలయాలకు దీటుగా తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మించడం చాలా సంతోషకరం మాజీ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి

**మంచాల వెలుతురు ఫిబ్రవరి 24:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రవేట్ విద్యాలయాలకు దీటుగా అన్ని వసతులతో నిర్మా ణం అవుతున్న తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణాలు చాలా అద్భుతంగా ద ర్శన మిస్తున్నాయి అని అన్నారు విద్యార్థులకు విద్యాబోధన చాలా బాగుంది అని అన్నారు క్రీడాప్రాగ ణాలు చిన్నారి విద్యార్థులు క్రీడలు ఆడుకునే ఆట వస్తువులు చాలా బాగున్నాయి అన్నారు ఇ లాంటి ప బ్లిక్ పాఠశాలలు తెలంగాణ రాష్ట్రంలో మరిన్ని మంజూరు చేస్తే తెలంగాణ రాష్ట్రం లోని పేద విద్యార్థులు మరింత విద్యావంతులుగా ఎదుగుతారు అనిఅన్నారు ఆరుట్ల గ్రామంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మించడం చాలా సంతోషకరం అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ హర్షంవ్యక్తం చేశారు ఈ కార్యక్రమం లో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిద్ధగోని గిరిదర్ గౌడ్ ప్రాథమిక పాఠశా ల ప్రధానోపాధ్యాయుడు మోహన్ గౌడ్ ఉపాధ్యాయులు లచ్చిరాంనాయక్ తదితరులు పాల్గొ న్నారు

# బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మల్లన్న దేవాలయా నిర్మాణానికి సహాయం కోరిన ఆరుట్ల గ్రామ యాదవ సంఘం పెద్దలు

- స్పందించిన బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి మల్లన్న దేవాలయానికి నాకు తోచిన సహాయం చేస్తాను



**మంచాల వెలుతురు ఫిబ్రవరి 24:** మంచాల మండలం ఆరుట్ల మల్లన్న దేవాలయం నిర్మాణంలో భాగంగా ఈరోజు ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ రంగారెడ్డి జిల్లా సర్పంచ్ లా ఫోరం అధ్యక్షులు తెలంగాణ లారీ ఓనర్స్ అసోసి యేషన్ ఉపాధ్యక్షులు బి ఆర్ ఆర్ పౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి గారిని కలిసి ఆలయ ని ర్మాణనానికి సహాయం కోరిన ఆరుట్ల గ్రామ యాదవ సంఘం పెద్దలు వెంటనే స్పందించి కచ్చితం గా ఆలయ నిర్మాణంలో నా వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పున్నం రాము మరియు యాదవ సంఘం పెద్దలు బోయినీ బలరాజు యాదవ్ బో యిని మల్లయ్య శివయ్య చీమల యాదయ్య సత్తయ్య దోమ జంగయ్య బోయిని దానయ్య ఐల య్య గునుకుల శ్రీశైలంపుణ్య మూర్తి యాదయ్య బైకని శ్రీకాంత్ దోమ మధు నరసింహ చింటూ యాదవ్ గ్రామ యువకులు బైకని మహేందర్ యాదవ్ కొత్తపల్లి సాయి అరుణ్ బూర పవన్ పా ల్గొన్నారు.యాదవ సంఘం పెద్దలు రాంరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మల్లన్న స్వా మి ఆశీస్సులు ఉండాలని కోరారు

# హిమాయత్ నగర్ డివిజన్లో రంగోలి పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి పురస్కారాలు

**- పురస్కాలను అందించిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 24:**

సంక్రాంతి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ లో నిర్వహించబడ్డ రంగోలి పోటీలలో విజేతలుగా నిలిచిన వారిని హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పురస్కాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత , ఖైరతాబాద్ డిసిసి మహిళా అధ్యక్షురాలు ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ విచ్చేసి పురస్కారాలను విజేతలకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం డివిజన్ మీ జోనులు వారిగా విభజించి మొదటి రెండో ,మూడో బహుమతి అందించడం జరిగింది. డివిజన్ మొత్తంలో ఉత్తమంగా వేసిన రంగోలి మీ ఎన్నుకొని మొదటి బహుమతిగా వాషింగ్ మెషిన్, రెండో బహుమతిగా మ్యూజిక్ సిస్టం అందించారు. ఇందులో పాల్గొన్న మహిళలకు అందరికీ కౌన్సిలేషన్ ప్రైసెస్ గా 300 ప్రైజులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోటి ఎస్‌బిఐ ఎటిఎం కాల్పుల ఘటన

**- కేసును ఛేదించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు**

**- నిందితులను వేటాడి పట్టుకున్న బృందాలు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**

నగరంలోని కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గత నెలలో కాల్పులు జరిగిన కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. ఈ కాల్పులకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వారిని పోలీసులు విచారిస్తున్నారు. జనవరి 31న కోఠి ఎస్‌బీఐలో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన రిన్షద్ అనే వ్యక్తి వచ్చాడు. అతడిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. అనంతరం అతడి వద్దనున్న రూ. 6 లక్షల నగదుతో పాటు బాధితుడి వాహనాన్నీ తీసుకుని పరారయ్యారు. ఈ కాల్పుల్లో రిన్షద్ కాలికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని రిన్షద్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్‌బీఐ ఏటీఎం ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ చోరీ అనంతరం నిందితులు కాచిగూడ డీమార్ట్ సమీపంలోని ప్రార్థనా మందిరంలోకి వెళ్లి.. దుస్తులు మార్చుకున్నట్లు గుర్తించారు. తర్వాత వాహనాన్ని రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి పరారయ్యారు. అక్కడి నుంచి వారు రైలెక్కి పారిపోయారా? లేక బస్సు కానీ ఇతర వాహనంలో కానీ వెళ్లారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అలా నిందితుల్లో ఒకరిని ఫిబ్రవరి 16న హరియాణాలో అరెస్ట్ చేశారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అందుకోసం ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలించి ఎట్టకేలకు మరో నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. వీరిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది.

# కన్నతల్లి కరకశత్వం

**- రెండునెలల చిన్నారి కిరాతక హత్య**

**- కట్టెల పొయ్యిలో వేసి హతం**



**హైదరాబాద్, ఫిబ్రవరి24(వెలుతురు):** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. రెండు నెలల బాలుడిని కన్న తల్లి అత్యంత దారుణంగా హత్య చేసింది. బాలుడిని క్టటెల పొయ్యిలో వేసి కాల్చి చంపింది. ఏడవకుండా నోట్లో బట్టలు కుక్కి, కాళ్లు కట్టేసి మరి హత్య చేసింది. బౌరంపేట్ ప్రాంతంలో ఈ అమానుష ఘటన జరిగింది. ఈ ఘటనపై స్థానికుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండిగల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బిహార్ కు చెందిన కుటుంబం బౌరంపేట్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ సైట్ వద్ద పని చేస్తున్నట్లు సమాచారం.నవమోసాలు మోసిన బిడ్డను అతి దారుణంగా చంపడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు పసిబిడ్డను చంపడానికి ఆమెకు మనస్సు ఎలా వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ తల్లి ఇలా ఎందుకు చేసిందో తెలియాల్సి ఉంది. అలానే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వివరాలు సేకరించారు.

# వైరాలో భారీగా గంజాయి పట్టివేత

**- వాహనాల తనిఖీలో పట్టుబడ్డ వైనం**

**ఖమ్మం,ఫిబ్రవరి24( వెలుతురు):**

ఖమ్మం జిల్లా వైరాలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా అవుతున్న 101.2 కిలోల ఎండు గంజాయితో పాటు 2.7 కిలోల హాషీష్ ఆయిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ అనుమాస్పదంగా ఉన్న హర్యానా నెంబర్ ప్లేట్ కలిగిన కారును ఆపి చెక్ చేసింది. తనిఖీల్లో గంజాయి, హ్యాషిష్ ఆయిల్ బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మహమ్మద్ అస్లాంను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితుడిని అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు 67.20 లక్షల రూపాయలుగా తెలుస్తోంది.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల ఆపరేషన్

**- 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్**

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**

'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. మొత్తం 16 రాష్ట్రాల్లోని 104 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల్లో బ్యాంకు అధికారులు కూడా ఉన్నారు. 32 బృందాలతో 16 రాష్ట్రాల్లో 10 రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. నిందితులపై దేశవ్యాప్తంగా 1,055 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు పలు సైబర్ నేరాల్లో రూ.127 కోట్లకు పైగా మోసాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. వారి నుంచి రూ.36 లక్షల నగదుతో పాటు 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్‌కార్డులు, 152 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 234 డెబిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

# రెండేళ్లుగా దేవాదుల నుంచి ఒక్క ఎకారా పారలేదు

- సాగునీరు అందించిన పాపాన పోలేదు
- నత్తనడకన వరంగల్ సూపర స్పెషాలిటీ నిర్మాణం
- అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా చర్చించడానికి సిద్ధం
- వరంగల్ ఆస్పత్రి నిర్మాణాలను పరిశీలించిన హరీష్ రావు

**వరంగల్,ఫిబ్రవరి24 వెలుతురు:**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో దేవాదుల నుంచి ఒక్క ఎకరా భూమినీ సేకరించలేదని, సాగునీరూ అందించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంత్రుల మాటలకు, సీఎం మాటలకు పొంతన లేదన్నారు. ఈ ప్రభుత్వానికి డేట్‌లు, డెడ్‌లైన్‌లు మాత్రమే మారుతున్నాయని హరీశ్ రావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి విరుచుకుపడ్డారు. మంగళవారం వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మాజీ మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్ట్‌ను తాము సందర్శించిన వెంటనే సీఎం రివ్యూ చేశారని.. తాము తట్టిలేపితేనే సీఎం నిద్ర లేస్తున్నారని



వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్ట్ మొదటి ప్రాధాన్యమని చెబుతూనే పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి నీళ్లను పొలాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసెంబ్లీలో కెమెరా తిప్పకుండా, మైక్ కట్ చేయకుండా చర్చించే దమ్ము సీఎంకు ఉందా అని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దేవాదుల ప్రాజెక్ట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయని, 10 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని.. త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల కోసం కేసీఆర్ హెల్త్ సిటీ నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం రేవంత్ రెడ్డిదని.. పేదల కోసం పనిచేసే ఆలోచన కేసీఆర్‌ది అని ఆరోపించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై నిర్లక్ష్యం చేయవద్దని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందని పనులు చేయట్లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రి ప్రారంభం కావట్లేదని విమర్శించారు. రెండేళ్లు ఓపిక పట్టామని.. ఇక నిలదీస్తామని, గల్లా పట్టి అడుగుతామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే బీఆర్ఎస్ నిరసన దీక్షలకు దిగుతుందని వార్నింగ్ ఇచ్చారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఏడాదిన్నరగా గుండె శస్త్ర చికిత్సలు ఆగిపోయాయని తెలిపారు. ఎంజీఎంలో 3 ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు పెట్టామని, ఇప్పుడు ఒక్కటి కూడా పనిచేయట్లేదని ఆయన విమర్శలు గుప్పించారు.

# పెళ్లి పేరుతో యువతులకు మోసం

**- వెలుగులోకి వచ్చిన యువకుడి బాగోతం**

**- ఉప్పల్‌లో ఓ పాస్టర్‌పై మహిళ ఫిర్యాదు**

**- రంగంలోకి దిగి దర్యాప్తుచేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**

పెళ్లి పేరుతో యువతులకు వల వేస్తున్నారు కేటుగాళ్లు. వారిని శారీరకంగా ఉపయోగించుకుని.. పైగా డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటనలు రెండు వెలుగులోకి వచ్చాయి. షాదీ డాట్ కామ్‌లో పరిచయం చేసుకుని మహిళలను మోసం చేస్తున్న వ్యక్తిపై ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మరోవైపు ప్రేమ పేరుతో వల విసురుతున్న ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. పెళ్లి కోసం ఈ మధ్య చాలా మంది మ్యారేజ్ వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. అందులో షాదీ డాట్ కామ్ కూడా ఒకటి. కానీ కొంత మంది కేటుగాళ్లు.. ఆయా వెబ్‌సైట్స్‌లో తమను తాము పెళ్లి కాని యువకులుగా రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత మెల్లగా ఫోన్ నంబర్ సేకరించి.. మాయమాటలతో యువతులకు వల విసురుతున్నారు. ఐతే ఒంటరి మహిళలనే వారు టార్గెట్ చేస్తూ అందిన కాడికి దోచేస్తున్నారు. చిన్న రంగా నాయక్ హైదరాబాద్ మల్కాజిగిరిలో ఉంటున్నాడు. షాదీ డాట్ కామ్‌లో ఒంటరి మహిళలను ఇతడు టార్గెట్ చేసుకుంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తాడు. తన మాయ మాటలతో నిజంగానే పెళ్లి చేసుకుంటానని నమ్మేలా చేయడం ఇతని స్పెషాలిటీ. అలాగే బాలాపూర్ మండలం మీర్‌పేట్‌లో ఉండే భవానీ అనే మహిళకు వల విసిరాడు. ఆమె ఫోన్ నంబర్ తీసుకుని.. పెళ్లి చేసుకుంటానని పూర్తిగా నమ్మించాడు. చివరకు తనకు ఖర్చులు ఉన్నాయంటూ క్రమక్రమంగా ఆమె వద్ద నుంచి 30 లక్షల రూపాయల వరకు వసూలు చేశాడు. తన ఖర్చుల కోసం అవసరాలు తీరిపోగానే.. ఇల్లు నిర్మించుకుందామని చెప్పాడు. కానీ డబ్బులు తీసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో భవానీ షాకైంది. గతంలోనూ ఇలాగే తప్పుడు పేర్లతో షాదీ డాట్ కామ్‌లో చిన్న రంగనాయక్ పలువురు మహిళలను మోసం చేసినట్లు భవానీ గుర్తించింది. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేసిన కఠిన శిక్ష పడేలా చేయాలని కోరుతోంది. మరోవైపు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఓ పాస్టర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యకు విడాకులు ఇచ్చేసి.. ప్రేమ పేరుతో మహిళలకు వల విసురుతున్నాడు. అతని పేరు సందీప్ వడేగర్. ఉప్పల్‌లో నివాసం ఉంటూ లివింగ్ వే చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. తన భార్యకు విడాకులు ఇచ్చేశాడు. ప్రేమ, పెళ్లి పేరుతో ఓ మహిళను ట్రాప్ చేశాడు. ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. ఆమె ప్రభుత్వోద్యోగం చేస్తుండడంతో వచ్చిన జీతం తీసుకుంటూ ఆమెను నిత్యం వేధిస్తున్నాడు. ఐతే అతని వేధింపులు తట్టుకోలేక పాస్టర్ సందీప్ ఆగడాలపై ఆ మహిళ ఆరా తీసింది. సందీప్‌కు అతని స్నేహితుడి భార్యతో వివాహేతర బంధం ఉన్నట్లు గుర్తించింది. దీనిపై అతన్ని నిలదీయడంతో ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరించాడు. సందీప్ బెదిరించడంతో.. ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ క్రమంలో నిందితుడు పాస్టర్ సందీప్ వెనుక సికింద్రాబాద్‌లోని మరో చర్చి ఫాదర్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం పోలీసులు మహిళ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అంబర్‌పేటలో తీవ్ర విషాదం

**- కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య**

**- హోటల్ నడుపుతూ దర్జాగా బతుకుతున్న కుటుంబం**

**- ఆర్థిక సమస్యలే కారణమంటూ సూసైడ్ నోట్**

**- దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**

హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేటలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను భర్త రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)గా గుర్తించారు. తొలుత మాధవిని రామరాజు, శశాంక్ ఊపిరాడకుండా చేసి చంపేశారు. అనంతరం వారిద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హోటల్ వ్యాపారంలో నష్టం, అప్పుల వారి వేధింపులతో ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరు ఎన్నో ఏళ్లుగా హోటల్ బిజినెస్ చేస్తున్నారు. కానీ ఏం కష్టం వచ్చిందో తెలియదు? అర్ధాంతరంగా ఈ కుటుంబం తనువు చాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తమ మృతికి ఆర్థిక భారం కారణం అంటూ సూసైడ్ నోట్ రాశారు. నిజంగానే వ్యాపారంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? లేక పరువు పోతుందేమోనన్న భయంతో ముగ్గురు సూసైడ్‌కు పాల్పడ్డారా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.



అంబర్ పేట్ లోని బాపూజీ నగర్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ల్యాండ్ మార్క్ హోటల్ యజమాని కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య పాల్పడ్డారు. మృతులను రామ్‌రాజ్, మాధవి, శశాంక్‌గా గుర్తించారు. హైదరాబాద్ అంబర్ పేట్‌లో ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని రామ్‌రాజ్ ఫ్యామిలీ సూసైడ్ చేసుకున్న వార్త స్థానికంగా కలకలం సృష్టించింది. రామ్ రాజ్ ఫ్యామిలీ ఎన్నో ఏళ్లుగా అంబర్‌పేట్‌లోనే నివాసం ఉంటున్నారు. సొంతిల్లు.. పెద్ద భవనం.. కోట్లలో ఆస్తులు ఉన్నాయి. కానీ ముగ్గురు సూసైడ్ చేసుకోవడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.. రామ్ రాజ్ ముందు భార్య మాధవిని చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. మరోవైపు రామ్‌రాజ్ కుమారుడు శశాంక్ తన ఎడమ చేయి కోసుకుని సూసైడ్ చేసుకున్నాడు. కానీ అతను చనిపోకపోవడంతో ఇంట్లోనే ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నట్టు రామ్‌రాజ్ సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు తెలిపారు. తన ఆస్తులు మొత్తం తన కూతురికేనంటూ వీలునామా కూడా రాసినట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌రాజ్ కూతురు అమూల్య కొంపల్లిలో ఉంటున్నట్లు తెలుస్తోంది. సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేస్తున్నారు పోలీసులు. రామ్‌రాజ్ కూతురు ఏదైనా కోణంలో అనుమానం వ్యక్తం చేస్తే.. ఆ దిశగా కూడా విచారణ చేస్తామని చెప్పారు పోలీసులు. ల్యాండ్‌మార్క్ హోటల్ యజమాని కుటుంబం మృతిపై రామ్‌రాజ్ అన్న జగదీశ్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆర్థిక ఇబ్బందులు పెద్ద సమస్య కాదని, తమది వెల్ సెటిల్డ్ కుటుంబం అని చెప్పారు. తమకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు జగదీష్. నా తమ్ముడు ఫ్యామిలీ సూసైడ్ ఎందుకు చేసుకున్నారో.. అసలు ఏం జరిగిందో తెలియడం లేదని కంటతడి పెట్టారు. మరోవైపు తెల్లవారు 3 గంటల 15 నిమిషాలకు రవి అనే మిత్రుడికి రామ్ రాజ్ వాట్సాప్‌లో సూసైడ్ చేసుకున్నామని మెసేజ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తన మిత్రుడు రామ్ రాజ్ ఇంటికి వచ్చి చూసేసరికి భార్యభర్తలు ఇద్దరు ఉరేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు రవి. రామ్ రాజ్.. అంబర్‌పేట్‌లో ల్యాండ్ మార్క్ హోటల్, మల్లేపల్లిలో బిరియాని సెంటర్, మల్లాపూర్‌లో కింగ్స్ హోటల్, చక్రిపురంలో మరొక హోటల్ నిర్వహిస్తున్నారు. ఐతే ఎవరైనా అప్పులు ఇచ్చిన వారు భయపెడితే చనిపోయారా? ఎవరైనా భయపెట్టారా? ఇలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

# ఎఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ నిరసనలు

**- యూత్ కాంగ్రెస్ చిల్లర చేష్టలపై విమర్శలు**

**- యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు చిబ్ అరెస్ట్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24( వెలుతురు):**

ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన 'షర్ట్‌లెస్' నిరసనకు సంబంధించి.. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిరసన గురువారం సమ్మిట్ ఎగ్జిబిషన్ హాల్‌లో జరిగిన సంగతి తెలిసిందే. ఐదుగురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు షర్టులు విప్పేసి, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా సందేశాలు రాసిన టీ-షర్టులు పట్టుకొని నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఆరోపణలు గుప్పించారు. సెక్యూరిటీ సిబ్బంది.. వారిని వెంటనే బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన తర్వాత ఏడుగురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.మంగళవారం ఢిల్లీ పోలీసులు ఉదయ్ భానును అరెస్టు చేశారు. ఆయన్ను తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారించిన తర్వాత అరెస్ట్ చేశారని సమాచారం. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్ట్‌ల సంఖ్య ఎనిమిదికి చేరింది. పోలీసులు ఆయనపై.. కుట్రలో పాత్ర ఉందని, విచారణకు సహకరించలేదని, తప్పుదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. త్వరలోనే కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. భూపేశ్ బాఘేల్ వంటి సీనియర్ నేతలు ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. 'ప్రజాస్వామ్యంలో యువత ప్రశ్నలు వేయడం,




నిరసన తెలపడం నేరం కాదు,అది ప్రజాస్వామ్య ఆయుధం' అని బాఘేల్ అన్నారు. ఈ అరెస్ట్‌లను అరాచక, అన్యాయ చర్యలుగా పేర్కొన్నారు. నిరసన శాంతియుతం గా జరిగిందని, యువత బాధలను బయటపెట్టడమే ఉద్దేశ్యమని కాంగ్రెస్ వర్గాలు వాదిస్తున్నాయి. బీజేపీ నేత ప్రదీప్ భండారి ఈ నిరసనను 'నేక్డ్ యాంటీ-ఇండియా ప్రొటెస్ట్' అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను యాంటీ-ఇండియా, యాంటీ-గ్రోత్ పార్టీగా విమర్శించారు. 'యువతకు కాంగ్రెస్ 'నంగి' పార్టీగా కనిపిస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో జరుగుతున్న చర్చలు, ప్రదర్శనలకు సంబంధించింది. దీనిని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈవెంట్‌గా చూస్తున్నారు. అయితే.. ఈ నిరసన వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని, దేశం పరువు మంటగలపాలన్నది వీరి పన్నాగమని బీజేపీ వర్గాలు మండిపడు తున్నాయి.

# ఇంటర్, టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ సేవలు

**- హాల్‌టిక్కెట్ చూపిస్తే కోరిన చోట స్టాప్**

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**

పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ హాల్ టికెట్లు చూపిస్తే కోరిన చోట బస్సు ఆపేలా వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 14వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగనుండటంతో.. పరీక్షల సమయంలో అదనంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు ఆర్టీసీ అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు బస్సుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో స్టాప్ లేకున్నా.. కోరిన చోట బస్సులు ఆపి విద్యార్థులను దింపేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

# గణపతి ఆచూకీ కనుగొన్న పోలీసులు

**- నేపాల్‌లో ప్రవాసంలో ఉన్నట్లుగా గుర్తింపు**

**హైదరాబాద్, ఫిబ్రవరి24( వెలుతురు):**

కొన్ని దశాబ్దాల పాటు మావోయిస్టు పార్టీని నడిపించిన అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ రావు ఆచూకీ లభ్యమైంది. గత కొన్నేళ్లుగా భారత్ పొరుగునున్న నేపాల్‌లో ఆయన మకాం వేశారు. తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నడవలేని పరిస్థితిలో ఉన్నారు. అయితే గణపతిని భారత్‌కు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వృద్ధాప్యం కారణంగా మావోయిస్టు పార్టీ కార్యదర్శి పదవిని గణపతి వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. మరో వైపు హైదరాబాద్‌లో పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట నలుగురు కీలక మావోయిస్టులు లొంగిపోనున్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సెక్రటరీ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డితోపాటు నున్నె నరసింహారెడ్డిలు లొంగిపోనున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబీ ఎదుట దేవ్ జీతోపాటు మల్లా రాజిరెడ్డి లొంగిపోయిన సంగతి తెలిసిందే. అదీకాక దేవ్ జీతోపాటు పలువురు అగ్రనేతలు మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలకు చేరుకున్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఈ నేపథ్యంలో కర్రెగుట్టల ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు మరణించిన విషయం విదితమే. 2026, మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశిరచుకొంది. ఆ దిశగా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీంతో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిరంతరం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. వేలాది మంది ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు అరెస్టయ్యారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లలో పలువురు అగ్రనేతలు సైతం మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పోలీసులకు చిక్కితే.. మావోయిస్టు పార్టీ చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

## గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్లు

**- ప్రభుత్వ పరిశీలనలో అంచనాలు**

**- మండలిలో ప్రశ్నలకు మంత్రి నిమ్మల సమాధానం**

**అమరావతి, ఫిబ్రవరి24( వెలుతురు):**

గుంటూరు ఛానల్ ఆధునీకరణకు 369 కోట్ల రూపాయలతో అంచనాలు రూపొందించారని నీటిపారుదల శ్శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ అంచనాల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.370 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. అయితే.. 2021లో ఆ నిధులను రద్దుచేస్తూ కొత్త అంచనాలు రూపొందించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.369 కోట్లతో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గుంటూరు ఛానల్ ఆధునీకరణపై ఏపీ శాసనమండలిలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రశ్న లేవనెత్తారు. గుంటూరు ఛానల్ సంబంధిత కట్టలు దెబ్బతిన్నాయని తెలిపారు. మంగళగిరి పట్టణం నుంచి మురుగు నీరంతా ఈ ఛానల్‌లో కలుస్తోందని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ ఛానల్ మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ పరిధిలో ఉండటంతో ఆయనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమంతరావు ప్రశ్నపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానిమస్తూ.. ఛానల్ పొడిగింపునకు రూ.285 కోట్లు విడుదల చేశామని మంత్రి నిమ్మల వెల్లడించారు. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గుంటూరు ఛానల్‌లో మురుగు కలవకుండా చూడాలని, దీనిపై మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించి చర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజా కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. మొదటి దశ కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు.

## శివారు ప్రాంతాల్లో రియల్ ఢమాల్



**హైదరాబాద్, ఫిబ్రవరి24( వెలుతురు):**

గత కొన్నేళ్లుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన హైదరాబాద్ శివార్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం ఊహించని మందగమనాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా నగరం నుండి 50 నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మెదక్ , వికారాబాద్ జిల్లాల పరిధిలోని వ్యవసాయ భూముల అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. గతంలో ఎకరాకు కోట్లు పలికిన ప్రాంతాల్లో కూడా ఇప్పుడు కొనుగోలుదారులు కరువవ్వడం, రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడం జిల్లా స్థాయి విశ్లేషణల్లో స్పష్టంగా కనిపిస్తోందిపెట్టుబడిదారులు ప్రస్తుతం వేచి చూసే ధోరణి ని అవలంబించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మారుతున్న భూవినియోగ విధానాలు, , మూసీ రివర్ ఫ్రంట్ వంటి భారీ ప్రాజెక్టుల పునర్నిర్మాణ నిర్ణయాల కారణంగా .. ఏ భూమి ఏ జోన్‌లోకి వస్తుందో అన్న ఆందోళన ఇన్వెస్టర్లలో నెలకొంది. దీనికి తోడు పెరిగిన మార్కెట్ విలువల వల్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు భారం కావడంతో, సామాన్య , మధ్యతరగతి పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారు.గతంలో వెంచర్ల పేరుతో వ్యవసాయ భూములను భారీ ధరలకు విక్రయించిన రియల్టర్లు ఇప్పుడు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. నగరం చుట్టూ ప్రతిపాదించిన రీజినల్ రింగ్ రోడ్ , ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల అలైన్‌మెంట్ విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో, భారీ పెట్టుబడులు పెట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు మాత్రమే తక్కువ ధరకైనా భూములు అమ్ముకోవడానికి సిద్ధపడుతుండగా, కొత్తగా కొనేవారు మాత్రం భద్రత లేనిదే ముందుకు రావడం లేదుఈ స్తబ్దత మరికొన్ని నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం భూసేకరణ , జోనింగ్ నిబంధనలపై పూర్తిస్థాయి స్పష్టత ఇస్తే తప్ప, శివారు ప్రాంతాల్లో మళ్లీ రియల్ జోరు పెరగడం కష్టమని తెలుస్తోంది. ప్రస్తుతానికి మాత్రం హైదరాబాద్ చుట్టూ ఉన్న వ్యవసాయ భూముల మార్కెట్ పూర్తిగా బ్రేక్ పడినట్లుగా కనిపిస్తోంది.

## ఖమ్మం కలెక్టరేట్ ప్రాంతంలో పేదల ఇండ్ల కూల్చివేతలు

**ఖమ్మం ఫిబ్రవరి24( వెలుతురు):**

ఖమ్మం నగర శివారులో వెలగుమట్ల వినోబా నగర్ భూదాన్ భూముల్లో అధికారులు ఇండ్ల కూల్చివేతలు ప్రారంభించారు. వెలుగుమట్లలోని 60 ఎకరాల భూదాన్ భూముల్లో నివసిస్తున్న 600 కుటుంబాలను ఖాళీ చేయించేందుకు వెళ్లారు. ఈనేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. జేసీబీల సహాయంతో గుడిసెలను తొలగించారు. పదేళ్ళుగా ఇక్కడే నివసిస్తున్నాం తమకు పట్టాలు ఇవ్వాలని నిర్వాసితులు అంటున్నారు. కాంగ్రెపస్ పార్టీకి ఓటు వేసినందుకు తగిన శాస్తి అయిందంటూ బాధితులు కన్నీళ్లు పెట్టుకున్నారు. కవరేజ్ కోసం వెళ్తున్న మీడియా ప్రతినిధులను కుడా పోలీసులు అడ్డుకున్నారు.

### కొండప్రాంతాల్లో రహదారుకలు

# అడవితల్లి బాట

**- రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలు**

**- అసెంబ్లీలో ప్రశ్నకు మంత్రి నాదెండ్ల సమాధానం**

**అమరావతి,ఫిబ్రవరి24( వెలుతురు):**



గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం చేపట్టినట్లు అసెంబ్లీలో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రూ.1,077 కోట్లతో ఈ కార్యక్రమం అమలవుతోందని.. దీని ద్వారా సుమారు 4 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరుగుతోందని మంత్రి వివరించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ 'అడవితల్లి బాట' కార్యక్రమంపై ప్రశ్న లేవనెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సభలో లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. మన్యం ప్రాంతంలో సరైన రోడ్లు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారని మంత్రి అన్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డోలీల ద్వారా రోగులను తరలించాల్సి వచ్చేదని చెప్పుకొచ్చారు. ఈ పరిస్థితిని మార్చాలనే ఉద్దేశంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని చేపట్టారని నాదెండ్ల మనోహర్ వివరించారు. అలాగే ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రామాల సమస్యను కొణతాల రామకృష్ణ సభలో ప్రస్తావించారు. ఈ గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. అయితే.. ఏపీ అధికారులు అక్కడికి వెళ్లకుండా ఒడిశా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం జోక్యం చేసుకుని త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

## పర్యాటకంగా విశాఖలో పలు అభివృద్ధి పనులు

**- రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు**

**- అసెంబ్లీలో మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి**

**అమరావతి,ఫిబ్రవరి24( వెలుతురు):**



ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖ నగరం కీర్తి కిరీటంగా నిలుస్తుందని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఎంవోయూ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి తెలిపారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో విశాఖను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ÷ఖ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. విశాఖను అడ్వెంచర్ , యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం దేవస్థానానికి రూ.54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ.28.87 కోట్లు మంజూరు చేసి పనులు వేగవంతం చేశామని వివరించారు. రుషికొండ, తిమ్మాపురం, సాగర్ నగర్ బీచ్, గోస్తనీ బ్యాక్ వాటర్స్‌లో స్కూబా డైవింగ్, పారా మోటరింగ్ వంటి 10 రకాల జలక్రీడలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో మరింత ఊతం వచ్చిందని మంత్రి అన్నారు. క్యారవాన్ పాలసీలో భాగంగా అన్ని ప్రాంతాల్లో క్యారవాన్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విశాఖలో 'హాప్-ఆన్, హాప్-ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులు' సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. హోమ్ స్టే పాలసీ, బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానంతో 490 హోమ్ స్టేలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 'సీఆర్‌జెడ్ 19' అమల్లోకి వస్తే పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయన్నారు. 2019-24 కాలంలో కుదేలైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కించిందని ఆయన వివరించారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో విస్తృతంగా పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు.

## మృతి చెందిన సభ్యులకు అసెంబ్లీ సంతాపం

**అమరావతి,ఫిబ్రవరి24( వెలుతురు):**

మంగళవారం శాసనసభలో పలువురు దివంగత నేతలకకు నివాళి అర్పించారు. ఇటీవల మరణించిన పలువురు మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం తెలియజేసింది. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పిడతల రాంభూపాల్ రెడ్డి, విజయవాడ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ పాషా, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటె సుమన్, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండు అప్పల సూర్యనారాయణ, తాడేపల్లిగూడెం మాజీ ఎమ్మెల్యే ఈలి వరలక్ష్మి, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రత్నాబాయి మృతి పట్ల సభ సంతాపం తెలిపింది. ప్రజా జీవితంలో వారు చేసిన సేవలను సభకు వివరించారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ శాసనసభ్యుల మృతికి గౌరవసూచకంగా సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## పశు వైద్యశాల ఆధునీకరణకు చర్యలు

**- అవసరమైన ఉపకరణాల సరఫరా**

**- అసెంబ్లీలో మంత్రి అచ్చన్నాయుడు**



**అమరావతి,ఫిబ్రవరి24( వెలుతురు):**

పశు వైద్యశాలల్లో సౌకర్యాలు, ఉపకరణాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అచ్చన్నాయుడు తెలిపారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఉచితంగా మందుల సరఫరా చేస్తున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని పశు వైద్యశాలల్లో సౌకర్యాల కొరత, వైద్యుల నియామకాలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుసమాధానం ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమైన శాఖలకు తాళాలు వేశారని.. అన్ని శాఖల్లో నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇబ్బందులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వివరించారు. వెటర్నరీ ఆసుపత్రుల భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. 2014-19 మధ్య కాలంలో నాబార్డ్ నిధులతో 326 భవనాలు మంజూరు చేశామని.. వాటిలో కొన్ని భవనాల నిర్మాణాలను అప్పట్లో పూర్తి చేశామని గుర్తుచేశారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కొత్త భవనాల నిర్మాణం నిలిపేసిందన్నారు. ఈ ఏడాది బ్జడెట్‌లో భవనాల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపడతామని మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రకటించారు.

## ఎవడిగోల వాడిదే .. లడ్డూ అంశంలో సమాధానంలేని ప్రశ్నలెన్నో..

**తిరుపతి, ఫిబ్రవరి24( వెలుతురు):**

తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సెగలు పుట్టిస్తోంది. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటూ ఒకరిపై ఒకరు విమర్శల యుద్ధం చేసుకుంటున్నాయి. ఈ వివాదంలో అసలు నిజానిజాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఇరు పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా జరిగిందంటూ టీడీపీ ఆధారాలతో సహా బయటపెట్టగా, వైఎస్సార్‌సీపీ దీనిని తీవ్రంగా ఖండిస్తోంది. జంతు కొవ్వు లేదని తమకు క్లీన్ చిట్ లభించిందంటూ సోషల్ మీడియాలో భారీగా ప్రచారం మొదలుపెట్టింది. అయితే, సరఫరా అయిన పదార్థం అసలు నెయ్యే కాదని సిట్ నివేదికలో తేలినప్పుడు క్లీన్ చిట్ అనే మాట ఎక్కడ నుంచి వచ్చిందని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇలా రోజుకో కొత్త మలుపుతో ఈ వ్యవహారం రచ్చకెక్కుతోంది.వైఎస్సార్‌సీపీ తనను తాను సమర్థించుకునే క్రమంలో ఇందాపూర్ డెయిరీ ప్రస్తావనతో పాటు హెరిటేజ్ సంస్థను కూడా వివాదంలోకి లాగింది. వాస్తవానికి ఈ కల్తీ నెయ్యి సరఫరాకు, హెరిటేజ్ సంస్థకు ఎటువంటి సంబంధం లేకపోయినా, రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఈ వ్యూహాన్ని అమలు చేస్తోంది. దీనివల్ల అసలు చర్చ పక్కదారి పట్టి, సంస్థల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలే ప్రధానంగా మారుతున్నాయప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీపై వైఎస్సార్‌సీపీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో వైసీపీ తరపున టీటీడీ విషయాల్లో న్యాయపోరాటం చేసిన సుబ్రహ్మణస్వామి ఏకసభ్య కమిటీకి వ్యతిరేకంగా పిటిషన్ వేశారు. కానీ అనుకూల తీర్పు రాలేదు. అటు ప్రభుత్వం మాత్రం తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తి లేదని, ఏకసభ్య కమిటీ ద్వారా పూర్తి వివరాలు సేకరిస్తున్నామని చెబుతోంది. ఈ రాజకీయ రణరంగంలో భక్తుల ఆవేదనను అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం పూర్తిగా విస్మరించాయనే విమర్శలు వస్తున్నాయి. కోట్ల మంది హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి ప్రసాదం అపవిత్రం అయిందనే బాధ భక్తుల్లో ఉంది. కానీ, నేతలు మాత్రం తమ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి, ప్రత్యర్థిని బద్నాం చేయడానికి పడుతున్న తాపత్రయం చూసి సామాన్య భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆరోపణలతో కాలక్షేపం చేయకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటమే అసలైన పరిష్కారం. ఆలయ పవిత్రతను కాపాడటం, నాణ్యమైన ముడి పదార్థాల సేకరణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రాజకీయ చదరంగంలో భక్తిని పావుగా వాడుకోకుండా, తప్పు చేసిన





వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని భక్తుల డిమాండ్ గా మారింది.

### భస్మాసుర హస్తం అవుతుందా

భస్మాసుర హస్తం గురించి.. ఇట్టే తెలిసిపోతుంది. పురాణ గాథలపై అవగాహన ఉన్నవారు ఈ విషయాన్ని ఇట్టే గ్రహించగలరు. శివుడు తపస్సుతో బ్రహ్మాసురుడు ఒక వరం పొందుతాడు. తాను ఎవరి తలపై చేయి పెడితే వారు భస్మం అయ్యేలా వరం అది. చివరకు శివుడునే సంహరించాలనుకుంటాడు. కానీ మోహిని రూపంలో ఉన్న విష్ణువు అదే భస్మాసురుడిని తన చేయితోనే అంత బంధించి.. లోక కళ్యాణం పరిసమాప్తం చేస్తాడు. అయితే ఇప్పుడు అదే భస్మాసురుడి మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన రాజకీయం రివర్స్ అయ్యింది. చేజేతులా సుప్రీంకోర్టుకు వెళ్లి ఏపీ ప్రభుత్వానికి సహకారం అందించేలా చేసింది. సుప్రీంకోర్టులో తాజాగా ఏపీ ప్రభుత్వ చర్యలకు అనుమతులు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దగ్గర ఉండి ప్రభుత్వానికి అనుకూలంగా ఆదేశాలు వచ్చేలా చేసిందిటీటీడీ లడ్డుకు సంబంధించి నెయ్యి కల్తీ వ్యవహారం గత కొన్ని నెలలుగా ఏపీలో నలుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విచారణ జరిపితే తమకు ఇబ్బందులు వస్తాయని భావించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. టీటీడీ మాజీ అధ్యక్షుడు వైవి సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. సిబిఐ నేతృత్వంలో విచారణ జరగాలని కోరారు. అయితే దీనిపై అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. సిబిఐ నేతృత్వంలోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఏడాదికి పైగా విచారణ చేపట్టిన సిట్.. తమ విచారణ నివేదికను చార్జ్ షీట్ రూపంలో కోర్టుకు సమర్పించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. అందులో లోపాలను సైతం సరిదిద్దుకోవాలని భావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని నియమించింది.ఏదైనా ఒక దర్యాప్తు సంస్థ ఒక అంశంపై విచారణ చేపట్టి చార్జ్ షీట్ దాఖలు చేస్తే.. చర్యలకు ఆదేశిస్తే.. అందులో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుమానంగా పరిగణించింది. అందుకే మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామిని రంగంలోకి దించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకసభ్య కమిటీని తప్పు పట్టి విమర్శలు చేసి ఉంటే కొంత వరకు వర్క్ అవుట్ అయ్యేది. ప్రజల్లో అనుమానం కలగడానికి అవకాశం కలిగేది. కానీ సుబ్రహ్మణ్యస్వామి ద్వారా ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తీర్పు అనుకూలంగా వస్తే మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని చూసింది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ కరెక్ట్ అని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చేలా చేయడంలో వైసిపి విజయవంతం అయింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అన్ని దారులు మూసుకుపోయాయి. ఏక సభ్య కమిటీ ఇచ్చిన నివేదికలు ఫైనల్ కానున్నాయి. అందులో ప్రతికూల అంశాలు వచ్చిన నోరు తెరిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశమే లేదు. ఇది ముమ్మాటికి ఆ పార్టీకి భస్మాసుర హస్తమే..

# కేరళ స్టోరీ మూవీపై హైకోర్టు విచారణ

## ముందుగా కోర్టులో చిత్ర ప్రదర్శనకు ఆదేశం

'ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది.ఈ సినిమా సెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.







# వారణాసి కోసం జార్జియాకు మహేశ్ బాబు

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫాంటసీ మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కథను కె.వి. విజయేంద్ర ప్రసాద్, ఎస్.ఎస్. కాంచి అందిస్తుండగా, మాటలను దేవ కట్టా రచిస్తున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. సినిమాలో మహేశ్ బాబు ద్విపాత్రాభినయం చేయనున్నారని సమాచారం. 'రుద్ర'గా శక్తివంతమైన యోధుడిగా, అలాగే పౌరాణిక ఎపిసోడ్‌లో 'రాముడు'గా దర్శనమివ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా 'మందాకినీ' పాత్రలో నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల పరిచయంతోనే సినిమాపై అంచనాలు గరిష్ట స్థాయికి చేరాయి. హైదరాబాద్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసిన యూనిట్, తదుపరి షెడ్యూల్ కోసం జార్జియాకు వెళుతున్నారు . ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే అడ్వెంచర్ ఎపిసోడ్‌లను విదేశీ లొకేషన్లలో తెరకెక్కించనున్నారని తెలుస్తోంది. అయితే జార్జియాకి వెళుతున్న మహేష్ బాబుకి భార్య నమ్రత, కూతురు సితార సెండాఫ్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే గ్రాండ్ యాక్షన్ బ్లాక్స్, భారీ సెట్స్ ఈ షెడ్యూల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇది పూర్తిస్థాయి సైన్స్ ఫిక్షన్ సినిమా కాదని, ఫాంటసీ మైథలాజికల్ జానర్‌కే చెందినదని రాజమౌళి తెలిపారు. పురాణాల నేపథ్యాన్ని ఆధునిక యాక్షన్ అడ్వెంచర్ శైలిలో మేళవిస్తూ భిన్న కాలప్రవాహాలను కలిపే కథగా 'వారణాసి' రూపుదిద్దుకుంటోందని చెప్పారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా మూవీ విడుదల కానుంది.



# గల్లాలు పట్టుకున్న మహేశ్ బాబు, రాజమౌళి

## వారణాసిపై వర్మ ఎఐ వీడియో వైరల్

అసాధ్యాలను సైతం సుసాధ్యం చేస్తోంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలుసుకోలేనంతగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తోంది. ఏఐ సహాయంతో సృష్టించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. అచ్చం అలాంటి ఒక వీడియోనే సినీ దర్శకుడు రామ్ గోపాల్‌వర్మ తాజాగా పంచుకున్నారు. ఇంతకీ అందులో ఏముందో స్టార్ హీరో మహేశ్‌బాబు , అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గొడవ పడుతున్నట్లు ఉన్న ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'సినిమా ఈజ్ డెడ్' అంటూ వర్మ పంచుకున్న ఈ ÷టింగ్ వీడియోపై అనేక కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొందరు ఈ క్రియేటివిటీని మెచ్చుకుంటుంటే, మరికొందరు తప్పుపడుతున్నారు. 'ఏఐతో ఏదైనా సాధ్యమే!' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'వారణాసి ప్రచారం సమయంలో కచ్చితంగా ఈ వీడియోను ప్లే చేస్తా'రని వ్యాఖ్యలు జోడిస్తున్నారు. 'మహేశ్ పాస్‌పోర్ట్ విషయంలోనే ఇద్దరూ గొడవపడుతున్నారు' అంటూ అభిమానులు స్పందించడం గమనార్హం. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న ఎపిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ ఇటీవల విడుదల చేసిన వీడియో, సినిమాకు సంబంధించి పలు విషయాలను తెలియజేస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూలు 'వారణాసి'పై ఆసక్తి పెంచాయి.



# బాలయ్య, పూరి కాంబినేషన్

## మూవీ చేస్తున్నారంటూ టాలీవుడ్ టాక్

టాలీవుడ్‌లో మాస్ ఇమేజ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన నందమూరి బాలకృష్ణ, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తో మరోసారి చేతులు కలపబోతున్నారనే వార్తలు ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందన్న ప్రచారం ఆసక్తి రేకెత్తిస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పైసా వసూల్ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకున్నప్పటికీ, బాలయ్యను స్టైలిష్ మరియు డిఫరెంట్ అవతార్‌లో చూపించడంలో పూరీ విజయం సాధించారు. ఆ సినిమాతో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందని అప్పట్లోనే ఇండస్ట్రీలో టాక్ వినిపించింది. ఇప్పుడు ఆ బాండింగ్ రెండో సినిమాకు దారితీస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది.దప్రస్తుతం పూరీ జగన్నాథ్ ఫామ్‌లో లేకపోయినా, ఆయన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్, పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌పై బాలకృష్ణ నమ్మకం ఉంచినట్లు సమాచారం. సరైన కథతో వస్తే పూరీతో మరోసారి పని చేయడానికి బాలయ్య సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. అఖండ విజయంతో బాలకృష్ణ కెరీర్‌లో కొత్త ఊపు వచ్చింది. యంగ్ డైరెక్టర్లతో కలిసి తన ఇమేజ్‌కు తగ్గ కథలను ఎంచుకోవడం ఆయన విజయాలకు ప్రధాన కారణంగా మారింది. ఇటీవల కాలంలో కథ ఎంపికలో బాలయ్య చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడి పేరు కంటే కథలోని కొత్తదనం, పాత్ర బలానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని సమాచారం. ఇక పూరీ జగన్నాథ్ విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం విజయ్ సేతుపతితో ఓ కొత్త ప్రాజెక్ట్ తెరకెక్కిస్తున్నారు. చాలాకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న పూరీ, ఈ సినిమాతో మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ సక్సెస్ అయితే, బాలయ్య?పూరీ కాంబోకు మరింత బలాన్నిస్తుందని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలకృష్ణ–పూరీ జగన్నాథ్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తి పెంచుతున్నాయి.





# కల్కి-2 షూటింగ్‌లో బచ్చన్, కమల్

పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 –2' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుంది. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. పాన్ ఇండియా లెవల్లో భారీ విజయాన్ని అందుకున్న 'కల్కి 2898 ంఆ' సీక్వెల్ షూటింగ్ శరవేగంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, విశ్వనటుడు కమల్ హాసన్ సెట్స్‌లో కలుసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో 'కల్కి 2' షూటింగ్ మొదలైనట్లు తెలుస్తుండగా.. ఈ షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) మధ్య కీలక సన్నివేశాలను దర్శకుడు నాగ అశ్విన్ చిత్రీకరిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ ద్వారా ఈ ఫోటోలను షేర్ చేస్తూ.. 'దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్ళీ కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిస్తోంది. చివరిసారిగా మేమిద్దరం 1985లో 'గిరఫ్తార్' సినిమాలో కలిసి నటించాం' అని రాసుకొచ్చారు. ఇక అమితాబ్ షేర్ చేసిన ఫోటోలలో ఇద్దరు స్టార్స్ ఆత్మీయంగా కౌగిలించుకోవడం, సరదాగా ముచ్చటించుకోవడం కనిపిస్తోంది. ఇందులో బిగ్ బీ తన అశ్వత్థామ గెటప్‌లో కనిపించబోతున్నాడు.

# జోరు మీదున్న కిరణ్ అబ్బవరం

టాలీవుడ్‌లో సక్సెస్ ఒక్కటి పడితే హీరోల మార్కెట్ విలువ ఎలా పెరుగుతుందో మరోసారి చర్చకు దారితీసింది. యువ హీరో కిరణ్ అబ్బవరం. వరుసగా మంచి విజయాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్‌ను ఆస్వాదిస్తున్నారని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వచ్చిన 'క', 'కె ర్యాంప్' సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు సాధించడంతో కిరణ్ అబ్బవరం మార్కెట్ గణనీయంగా పెరిగిందని సమాచారం. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే కథలు, అందులో కామెడీ?ఎమోషన్?సెంటిమెంట్ మేళవింపుతో ఆయన ఎంచుకునే స్క్రిప్ట్స్ నిర్మాతలకు నమ్మకం కలిగిస్తున్నాయంటున్నారు. కిరణ్‌తో సినిమా చేస్తే మినిమమ్ గ్యారెంటీ' అన్న భావన కొందరు నిర్మాతల్లో ఏర్పడిందని ఇండస్ట్రీ టాక్. దీంతో ఆయనకు భారీ ఆఫర్లు వస్తున్నాయని ప్రచారం. తాజా సమాచారం ప్రకారం, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ఒక్కో సినిమాకు దాదాపు రూ.12 కోట్ల వరకు రెమ్యునరేషన్ అందుకుంటున్నారట. ఇటీవల ఓ ప్రముఖ నిర్మాణ సంస్థతో కుదిరిన ఒప్పందంలో కూడా ఇదే స్థాయిలో పారితోషికం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. 'కె ర్యాంప్' తర్వాత కిరణ్ అబ్బవరం మరో రిఫ్రెషింగ్ లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రస్తుతం ఆయన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో 'మ్యాడ్' ఫేమ్ శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తుండగా, సంగీతాన్ని మణిశర్మ అందిస్తున్నారు. కథను 'బేబీ' ఫేమ్ సాయి రాజేష్ అందిస్తున్నారు. నిర్మాత ÷ూఐఔతో కలిసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోంది. చెన్నై నేపథ్యంగా సాగే ఈ లవ్ స్టోరీలో ఫస్ట్ లవ్, రిలేషన్‌షిప్స్‌లోని కొత్త కోణాన్ని చూపించనున్నట్లు విడుదలైన గ్లింప్స్ సూచిస్తోంది. యంగ్ హీరోల్లో కిరణ్ అబ్బవరం, సరైన కథల ఎంపికతో ముందుకెళ్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రెమ్యునరేషన్ పెంపుపై వస్తున్న వార్తలు నిజమైతే, ఇది ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా మారే అవకాశం ఉంది.మొత్తానికి, వరుస విజయాల జోరుతో కిరణ్ అబ్బవరం టాలీవుడ్‌లో తన మార్కెట్ విలువను మరింత స్టాం÷–రగ్ చేసుకుంటున్నాడని చెప్పవచ్చు.

# పోలవరం ప్రాంతంలో మరోమారు పులికలకలం

**- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అటవీ అధికారులు**



**రాజమండ్రి, ఫిబ్రవరి24( వెలుతురు):**
పోలవరం జిల్లాలో మరోసారి పులి సంచారం కలకలం రేపుతోంది. రంపచోడవరం మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదే పులి సంచరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ పులిని అటవీ అధికారులు ఎంతో చాకచక్యంగా బంధించి విశాఖపట్నం జూకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన తర్వాత, ప్రత్యేక కమిటీ నిర్ణయం మేరకు పాపికొండలు అభయారణ్యంలో వదిలిపెట్టి.. ఆ వీడియోలను మీడియాకు విడుదల చేశారు. అయితే, ఇదే పులి గత రెండు రోజులుగా మారేడుమిల్లి మండలం అటవీ ప్రాంతంలో కనిపించింది. కాకవాడ, దారగూడెం, నూరుపూడి, సీమగండి, రామన్నవలస, తుర్రూరు, దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల సరిహద్దుల్లో సంచరించినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం మండలంలోని గెద్దాడ, చిలకమామిడి, బూసిగూడెం అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి సంచారంతో అటవీశాఖ నిఘా పెంచింది. పులి కదలికలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని అటవీ అధికారులు హెచ్చరించారు.

# అధికారం అడ్డంపెట్టుకుని దోపిడీ

**- నెయ్యి నిబంధనలు మార్చిందెవరు**

**- అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల**



**అమరావతి, ఫిబ్రవరి24( వెలుతురు):**
వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సొంత కంపెనీలకు దోచిపెట్టారని తెదేపా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర విమర్శించారు. తిరుమల నెయ్యి సేకరణకు సంబంధించిన కఠిన నిబంధనలను మార్చిందెవరని ఆయన ప్రశ్నించారు. రోజుకు 4లక్షల లీటర్ల సామర్థ్యం నిబంధనను తీసేశారని.. రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు తీసుకొచ్చారని చెప్పారు. డెయిరీ అనుభవాన్ని మూడేళ్ల నుంచి ఏడాదికి తీసుకొచ్చారన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో ధూళిపాళ్ల మాట్లాడారు. నిబంధనలు సడలింపు చేయడంతో తమకు కావాల్సిన ప్రైవేటు వ్యాపారులకు టెండర్లు ఇచ్చేందుకు పునాది పడింది. ఒక మహాపాపం, దోపిడీకి ఆనాడే తెరలేపారు. కల్తీ నెయ్యిని ఏటా సరఫరా చేశారు. నాటి ప్రభుత్వ పెద్దల భాగస్వామ్యం లేకపోతే తిరుమలలో ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా సాగుతుందా? వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు?‘ అని ఆయన ప్రశ్నించారు.

# నెయ్యి సేకరణలో 2020లో నిబంధనలు మార్పు

**- కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పిఎస్‌లో కేసు**

**- అసెంబ్లీలో కల్తీ లడ్డూ కేసు వివరాలు వెల్లడించిన ఆనం**



**అమరావతి, ఫిబ్రవరి24( వెలుతురు):**
తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తొలుత తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అనంతరం సీనియర్ అధికారులతో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైందని చెప్పారు. ఆ తర్వాత సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో సిట్‌ను పునర్ వ్యవస్థీకరించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశంపై శాసనసభలో నిర్వహించిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు. 2014నుంచి ఈ-టెండర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ ఆవు నెయ్యిని తితిదే సేకరిస్తోంది. కమిటీ సిఫార్సుల ఆధారంగా 2019లో టెండర్ నిబంధనలను బలోపేతం చేశారు. ఆ తర్వాత 2020లో సేకరణ నిబంధనలను మార్చారు. 5 నెలల వ్యవధిలోనే వాటిని సవరించినట్లు తేలింది. నిర్వహణ అనుభవాన్ని 3 ఏళ్ల నుంచి ఏడాదికి.. వార్షిక టర్నోవర్ అవసరాన్ని తగ్గించారు. ఆవు పాల కొవ్వు ఉత్పత్తి ప్రమాణాలను తగ్గించారు. తప్పనిసరి పాల సేకరణ నిబంధనను తొలగించారు. సమగ్ర అధ్యయనం, క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా సడలింపు చేశారు. అనుభవం లేని డెయిరీల ప్రవేశానికి ఇది దోహదపడినట్లు సిట్ గమనించింది. భోలేబాబా, వైష్ణవి సంస్థలతో పాటు ఇతర నిందితుల డెయిరీలు తక్కువ ధరను కోట్ చేయడం ప్రారంభించాయి. భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పేర్కొన్నప్పటికీ బిడ్డర్ల సంఖ్య గణనీయంగా పెరగలేదు. కొన్ని నిర్దిష్ట సరఫరా దారులకు మాత్రమే అసమానంగా ప్రయోజనం చేకూర్చినట్లు ఈ సడలింపు ద్వారా తెలుస్తోంది‘అని ఆనం రామనారాయణరెడ్డి వివరించారు.

# అన్నాడీఎంకే ను లైట్ తీసుకున్నారా...

**చెన్నై, ఫిబ్రవరి24( వెలుతురు):**
తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. వేలూరులో ప్రచార సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతం జరుగుతుందని, టీవీకే క్లీన్ స్వీప్ చేస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానంగా పోటీ కేవలం తమ పార్టీకి, అధికార డీఎంకేకు మధ్యే ఉంటుందని ప్రకటించడం ద్వారా, అన్నాడీఎంకే ఉనికిని ఆయన పూర్తిగా తోసిపుచ్చారు. క్షేత్రస్థాయిలో డీఎంకేకు ప్రత్యామ్నాయం తామేనని ప్రజలకు సంకేతాలు పంపడమే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.తమిళనాడు అంటే విజయ్.. విజయ్ అంటేనే తమిళనాడు అంటూ గతాన్ని గుర్తు చేస్తూ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. డీఎంకే పాలనపై విజయ్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్నది స్టాండప్ కామెడీ ప్రభుత్వమని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన ప్రభుత్వం సూపర్ స్టార్ మోడల్ అని చెప్పుకుంటున్నారని, కానీ అది నిజానికి సూపర్ స్టాండప్ కమెడియన్ మోడల్ అని ఎద్దేవా చేశారు. స్టాలిన్ ప్రకటిస్తున్న పథకాలు, చేస్తున్న వాగ్దానాలు కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని ఆరోపించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న



విధానాలు కూడా కేవలం తన పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడానికేనని, అవి స్టాలిన్ ఆపరేటింగ్ ప్రొసీజర్’ లా మారిపోయాయని విమర్శించారు. గత ఏడాది కరూర్ ర్యాలీలో జరిగిన విషాదకర తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయ శత్రువులు ఎవరూ లేరని చెప్పే స్టాలిన్, మరి ఆ ఘటనకు తనను ఎందుకు బాధ్యుడిని చేశారని నిలదీశారు. ప్రభుత్వం కావాలనే తక్కువ స్థలం ఉన్న ప్రాంతాల్లో సభలకు అనుమతి ఇచ్చి, భద్రతా వైఫల్యాలకు కారణమైందని ఆరోపించారు. 2026 ఎన్నికలు దుష్ట శక్తి, స్వచ్ఛమైన శక్తి మధ్య జరిగే పోరాటమని ఆయన అభివర్ణించారు. తమిళనాడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది తనతోనే సాధ్యమని విజయ్ బలంగా నమ్ముతున్నారు. స్టాలిన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు ప్రతిపక్ష కూటమి రేసులో లేదని చెప్పడం ద్వారా ఓటర్లను తనవైపు తిప్పుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాబోయే ఎన్నికలను ‘విజయ్ వర్సెస్ స్టాలిన్’ మధ్య జరిగే పోరుగా అభివర్ణిస్తున్నారు. అన్నాడీఎంకే పట్టు కోల్పోయిన స్థానాల్లో టీవీకే తన బలాన్ని పెంచుకుంటే, అది రాష్ట్ర రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఏటా 54 వేల కోట్ల రూపాయల దానం

**హైదరాబాద్,ఫిబ్రవరి24( వెలుతురు):**
దేశంలో దాతృత్వ కథలు సంపన్నులతో మొదలవుతాయి. ఆ తరువాతే సామాన్యుల వంతు.సంపన్నుల్లో కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత బడ్జెట్లు, బిలియనీర్లు ఇచ్చే కోట్ల రూపాయల వంటి ఆకర్షణీయ అంశాలు చాలా ఉన్నాయి. కానీ భారత్‌లో సామాన్యులు చేసే దానధర్మాలే ఎక్కువని ఓ నివేదిక చెబుతోంది.సంస్థాగత పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థలు దాతృత్వంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయనే సంప్రదాయ వాదనను ‘హౌ ఇండియా గివ్స్ 2025 నివేదిక’ సవాలు చేస్తోంది.దీన్ని అశోకా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ రూపొందించింది.దాతృత్వంలో పెట్టుబడిదారులు, కార్పోరేట్ సంస్థల కంటే ఎక్కువగా సాధారణ, మధ్య తరగతి వర్గం పెద్ద పాత్ర పోషిస్తున్నట్లు ఈ నివేదిక చెబుతోంది.భారత్‌లో గృహస్తులు ఏటా నగదుతో పాటు దుస్తులు, ఇతరత్రా వస్తువుల రూపంలో దాదాపు ‘54వేల కోట్ల రూపాయలు’ స్వచ్ఛందంగా ఇస్తున్నారని ఈ నివేదిక అంచనా వేసింది.వారిలో 68 శాతం మంది ఏదో ఒక రూపంలో దానం చేస్తున్నట్లు నివేదిక తెలిపింది. ఇందులో 48 శాతం మంది ఆహారం, దుస్తులు లేదా ఇంట్లో వాడి పడేసిన వస్తువులు, 44 శాతం మంది నగదుగానూ, 30 శాతంమంది లాభాపేక్షలేని, మతపరమైన సంస్థలతో కలిసి అందించే స్వచ్ఛంద సేవ రూపంలో ఉంది.అన్నదానం కోసం ఇచ్చే విరాళాల్లో ఎక్కువ శాతం మతపరమైన ఉచిత అన్నదాన పథకాలకు వెళుతోంది. అలాగే ఈ సంస్థలు ప్రకృతివిపత్తులవేళ అందించే సాయంతోపాటు ఇతర పనులలోనూ స్వచ్ఛందంగా పాల్గొంటున్నాయి.”భారత్ ప్రజల్లో దాతృత్వగుణం ఎక్కువ. సంపన్నుల కంటే సాధారణ ప్రజలు విరాళాలు ఇవ్వడంలో, దాన ధర్మాలు చేయడంలో పెద్ద పాత్ర పోషిస్తున్నారని మా పరిశోధనలో తేలింది. దాతృత్వం దేశ ప్రజల్లో సాంస్కృతికంగా, విస్తృతంగా ఇమిడి పోయింది” అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ హెడ్ జిన్నీ ఉప్పల్ చెప్పారు.భారతీయుల్లో ఉదారత్వం కేవలం సంపన్నుల్లోనే కాదు, మత విశ్వాసాలను పాటించే సమూహాలు, ప్రత్యక్షంగా అడిగే సాయాలు, ఆదాయంతో సంబంధం లేకుండా సాధారణ ప్రజలు చేసే దానాలతో ఇది ముడి పడి ఉంది.భారత్‌లోని 20 రాష్ట్రాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 7 వేల మంది అభిప్రాయాలు సేకరించి ఈ నివేదిక రూపొందించారు.ఈ విశ్లేషణ నేషనల్ శాంపిల్ సర్వే మీద ఆధారపడి ఉంది. రోజువారీ దాతల వివరాలను పొందుపరిచేందుకు ప్రభుత్వం భారీ స్థాయిలో గృహ వినియోగానికి సంబంధించి సర్వే నిర్వహిస్తుంది. దీన్ని నేషనల్ శాంపిల్ సర్వే చేపడుతుంది.ఈ సర్వేలో పాల్గొన్నవారు మూడు నెలల కాలంలో తాము ఎంత తరచుగా, ఎంత మొత్తం విరాళంగా ఇచ్చామో చెప్పారు.వార్షిక అంచనాలను రూపొందించేందుకు సర్వేలో సేకరించిన అంశాల ఆధారంగా నివేదికలో అంశాలను నిర్ధరించారు.ఈ సర్వే ‘రోజువారీ దానాల’ను పరిశీలించింది. బిచ్చగాళ్లకు సాయం చేయడం, కుటుంబం లేదా స్నేహితులకు వ్యక్తిగతంగా సాయపడటం, సంస్థాగత, మతేతర సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఇందులో ఉన్నాయి.అంతే కాకుండా ఇది “విడిగా ఇవ్వడాన్ని” (రిటైల్ గివింగ్) కూడా పరీక్షించింది. రిటైల్ గివర్స్ అంటే సంపన్నులు కాకుండా, సాధారణ వ్యక్తులు లాభాపేక్ష లేని సంస్థలకు ఇచ్చే విరాళాలు. ఈ సర్వే దానానికి సంబంధించి విస్తృత పరిధిలో డేటాను సేకరించింది. అందులో వ్యక్తులకు నేరుగా సాయమందించడం, మత సంస్థలకు విరాళాలు ఇవ్వడం లాంటివి ఉన్నాయి.సామీప్యత, విశ్వాసం ఆధారంగానే చాలా మంది దానాలు చేస్తున్నట్లు సర్వే గుర్తించింది.విరాళాలు ఇచ్చే వారిలో దాదాపు 40 నుంచి 45 శాతం మంది ప్రజలు మతపరమైన సంస్థలకు ఇస్తున్నారు.ఇందులో ఎక్కువ వాటా పట్టణ ప్రాంతాల్లోని బిచ్చగాళ్లు, నిరాశ్రయులకు వెళుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో మతపరమైన సంస్థలకు ఎక్కువ విరాళాలు అందుతున్నాయి.”దానం చేయడానికి మిమ్మల్ని ప్రేరేపిస్తున్నది ఏంటని మేము అడిగినప్పుడు మతపరమైన విశ్వాసమే తమకు ప్రేరణ అని 90శాతం మందికి పైగా చెప్పారు” అని అశోకా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రఫీ పరిశోధన అధిపతి క్రిషాను చక్రవర్తి చెప్పారు.వ్యక్తిగతంగా వచ్చి నేరుగా అడగడం, ప్రచారం, ఇళ్ల వద్దకు విరాళాలు సేకరించేవారు, ప్రార్థనా స్థలాలు లేదా బహిరంగ ప్రదేశాలు ఏదైనా కావచ్చు ప్రజలు ఇలాంటి చోటనే విరాళాలు ఇస్తున్నారు. అంతే కానీ డిజిటల్ ప్రచారాలు లేదా విరాళాలు సేకరించే కార్యక్రమాలను పెద్దగా పట్టించుకోవడం లేదు.చదువుకు దాన గుణానికి పరస్పర సంబంధం ఉందని సర్వేలో తేలింది. రోజువారీ దాన ధర్మాలు చేసే వారిలో గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎక్కువ మంది ఉన్నారు.అయితే దాన ధర్మాలు చేయడం కేవలం సంపన్నులు, చదువుకున్న వాళ్లకే పరిమితం కాదు. నెలకు రూ.4వేల నుంచి రూ.5వేలు సంపాదించే వారిలోనూ సగం మంది దానం చేస్తున్నారు. వారి సంపాదన పెరిగే కొద్దీ దానాలు చేసే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.ఇందులో లింగపరమైన అంశాలు చిన్నవే అయినా స్పష్టంగా ఉన్నాయి. మగాళ్ల పెత్తనం ఉన్న ఇళ్లలో కాస్త ఎక్కువగా మతపరమైన దానాలు చేస్తుంటే, మహిళల పెత్తనం ఉన్న ఇళ్లలో నిరుపేదలకు దానం చేయడం ఎక్కువగా ఉంది.”ఈ సర్వేలో కీలకమైన అంశం ఏంటంటే భారతీయుల్లో రోజువారీ దానాలు చేయడం అనేది అప్పుడప్పుడు కాకుండా క్రమబద్ధంగా ఉంది” అని ఉప్పల్ చెప్పారు.” ఇది ఆదాయం, వయసు, లింగం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అన్ని చోట్లా, అందరిలోనూ ఉంది. దైనందిన సామాజిక జీవితంలో కనిపిస్తూనే ఉంటుంది” అన్నారు.మరో ముఖ్య విషయం ఏంటంటే, భారత్‌లో మొత్తం దానధర్మాల్లో రోజూ దానం చేసే వారి వాటా 15శాతం వరకు ఉంటుందని అంచనాలు సూచిస్తున్నాయి.పదిహేను శాతమే అయినప్పటికీ వ్యవస్థీకృత సామాజిక రంగానికి అందుతున్న ప్రైవేట్ డొనేషన్లలో మూడోవంతుగా ఉంది.”రోజూ దానం చేసే వాళ్లు ఇచ్చేది కొద్ది మొత్తమే అయినా, సామాజికంగా ప్రభావం చూపడంలో ప్రజల భాగస్వామ్యాన్ని సూచిస్తోంది” అని ఉప్పల్ చెప్పారు.సర్వేలో ప్రజల నుంచి వచ్చిన సమాధానాలను వారి రోజువారీ ఖర్చులతో కలిపి చూసినప్పుడు, ప్రజలు ఖర్చు చేసే తీరుతెన్నులు దానధర్మాలు చేయడానికి ఎలా దోహద పడుతున్నాయో పరిశీలించారు.ఇంటి ఖర్చులు పెరిగే కొద్దీ, విరాళాలు ఇవ్వడం, దానం చేసే మొత్తం కూడా పెరుగుతున్నట్లు సర్వే గుర్తించింది.”ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ కూడా ఒకటి. భారత జీడీపీలో ప్రజల వినిమయశక్తి ప్రధాన భాగం. గృహ వినియోగం విస్తరిస్తున్న కొద్దీ, దాన ధర్మాలు, విరాళాలు పెరిగే అవకాశం ఉంది” అని ఉప్పల్ చెప్పారు.అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రజల రోజువారీ దాన ధర్మాలు, విరాళాలు ఎన్జీవోలకు వెన్నెముక లాంటివి.ఈ సర్వేను మత పరమైన వేడుకలు, పండుగలు తక్కువగా ఉండే మార్చ్- ఏప్రిల్ మధ్య నిర్వహించినట్లు ఉప్పల్ తెలిపారు.”మతపరమైన సంస్థలకు ఇచ్చే వ్యక్తిగత విరాళాలు ఎక్కువగా ఉండటంతో మతపరమైన సందర్భాలు ఉన్న నెలల్లో ప్రజల్లో ఎక్కువ మంది విరాళాలు ఇస్తారని భావించవచ్చు” అని ఆమె అన్నారు.

# కర్ణాటక కాంగ్రెస్ లో మరో వివాదం

**38 మంది ఎమ్మెల్యేలు చాన్స్ ఇవ్వాలంటూ లెటర్**

**బెంగళూరు, ఫిబ్రవరి24( వెలుతురు):**
కర్ణాటక కాంగ్రెస్‌లో మరోసారి రాజకీయాలు వేడెక్కాయి. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పదేపదే ఢిల్లీకి వెళ్లి వస్తున్నారు. ఇదే సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడంతో సీఎం మార్పుపై రెండు మూడు రోజుల్లో ఏదో ఒక నిర్ణయం వెలువడుతుందనే సంకేతాలు వస్తున్నాయి. ఇదే సమయంలో తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్ పెద్దలకు లేఖ రాయడం మరో కొత్త సమస్య వచ్చి పడింది.కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్ ఇంకా వీడలేదు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం మరోసారి ఆసక్తికర పోరు నెలకుంది. సీఎం మార్పు తప్పదని కొన్నాళ్లుగా ప్రచారం సాగుతోంది. ఈ సాగదీత పార్టీకి మంచిది కాదని, 2028 ఎన్నికల్లో గెలవాలంటే తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. కర్ణాటక పంచాయతీ హైకమాండ్‌కు పంటి కింద నలుసులా మారింది. ఈ తరుణంలో మరో కొత్త తలనొప్పి వచ్చి పడింది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పాటు సీఎం సిద్ధరామయ్య, డీకేలకు తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు లేఖ రాశారు.కొత్తగా ఎన్నికైన తమకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాల్సి కోరుతూ ‘యువ నాయకత్వం కోసం ప్రజల నుంచి వచ్చిన స్పష్టమైన తీర్పు’ అని వారు ఆ లేఖలో అభివర్ణించారు. 2023 ఎన్నికల్లో విజయం తర్వాత 34 మందితో ఏర్పడిన మంత్రివర్గంలో తమలో ఎవరికి అవకాశం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. ‘మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారికి కూడా క్యాబినెట్‌లో చోటు కల్పించడం న్యాయమైందే’ అని డిమాండ్ చేశారు.



కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని కోరిన వారు.. కనీసం ఐదుగుర్ని క్యాబినెట్‌లోకి తీసుకుంటే అనుభవానికి యువశక్తి,తోడైతే పాలన మరింత మెరుగుపడటానికి సహాయపడుతుందని వాదించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన తమకు మంత్రులుగా అవకాశం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లోకి తీసుకోవడం అసాధారణమేమీ కాదన్న వారు.. పలు రాష్ట్రాల్లో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులుగా, సీఎంలుగా కీలక బాధ్యతలు అప్పగించిన సందర్భాలున్నాయని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ సిద్ధాంతం, పారదర్శక పాలన పట్ల తమ నిబద్ధతను నొక్కి చెబుతూ.. యువ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించడం వల్ల పార్టీ సంస్థాగతంగా బలోపేతమవుతుందని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుందని ఆ ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాయకత్వం మార్పుపై మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానికి ఈ లేఖతో కొత్త చిక్కు వచ్చి పడింది.నాయకత్వ మార్పుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ సంచలనంగా మారింది.

తనను దెబ్బతీయడానికి కొందరు కుట్రలు చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన తనపై రాజకీయ కుట్రలు సహజమేనని సిద్ధరామయ్య అన్నారు. అయితే, తాను పిరికివాడిని కాదని, అలాగే తన రాజకీయ జీవితం పూలబాట కాదన్నారు. ప్రజా మద్దతుతోనే రాళ్లు, ముళ్లున్న రాజకీయ రహదారిని దాటుతూ వచ్చానని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటీవల తనను కలిసిన మంత్రులు సతీష్ జార్కిహోళి, మాజీ మంత్రి రాజణ్ణ, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం సూచిస్తామని చెప్పారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com